


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెద్నెగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243


RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 153 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-

## సామాజిక సమానత్వం కోసమే

# అహర్నిశలు కృషి



**బలహీన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యత - అసమానతలు తగ్గించడానికే పీ4 కార్యక్రమం**

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు గతాని కంటే ఎక్కువ కేటాయింపులు - స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు**

**సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక సమానత్వం కోసమే కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించి జనాభా దామాషా ప్రకారం బలహీన వర్గాలు అన్నిటా ప్రాతినిధ్యం వహించేలా సామాజిక సాధికారత సాధించేలా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. బడ్జెట్‌లో సంక్షేమ శాఖల కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానిదని అన్నారు. వీటితో పాటు అన్ని వర్గాలకూ మరింత అదనంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకారుల సేవలో పథకాలతో పాటు చేనేత కార్మికులకు కూడా ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమాన్ని అందించి న్యాయం చేస్తున్నామని అన్నారు.

**బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు పెంచాం**

'చౌక దుకాణాల ద్వారా వినియోగదారులకు మరింత సమర్థంగా సరకులు అందించేందుకు ప్రణాళిక చేయటంతో పాటు సక్రమంగా చేరవేసేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నాం. సంక్షేమ పథకాలను సాంకేతికత సాయంతో అనుకున్న సమయానికే చేరేలా చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రూ.3.32 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు గతం కంటే పెంచాం. కేటాయించిన మొత్తాలను ఆ వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తాం. సంక్షేమ కార్యక్రమాల ఇవ్వడంతో పాటు ప్రతి వర్గాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ప్రజల ఆదాయాలను పెంచి జీవనప్రమాణాలు మెరుగుపరుస్తాం. స్వర్ణాంధ్ర 2047 విజన్ నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం రూ.3 లక్షలు ఉన్న తలసరి ఆదాయాన్ని 2047 నాటికి రూ.54 లక్షలకు పెంచే నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకెళుతున్నాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

**దృష్టంతా భావితరాలపైనే**

'మా దృష్టి అంతా భావి తరంపైనే మిగతా .. 2లో..

## కల్తీ పాల బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

**సీఎం చంద్రబాబు ఆదేశం**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికుల అస్వస్థత, మరణాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్‌గా ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న సాయాన్ని సీఎంకు వారు వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో విక్రయదారులు 106 ఇళ్లకు పాలు పంపిణీ చేశారని అధికారులు వివరించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 73 మంది నుంచి రక్తనమూనాలను సేకరించామని.. మిగిలిన వారివి కూడా సేకరిస్తున్నామని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారని తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలతో పాటు మిగతా .. 2లో..

### ఓటీపీలు చెప్పకండి..

# పాస్‌వర్డ్‌లు మార్చండి

**డిజిటల్ మోసాలపై అప్రమత్తం సుమా : 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ**



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** లావాదేవీల్లో ఓటీపీలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దని, కాలాలకు అనుగుణంగా దుస్తులు, ఆహారంలో మార్పులు చేసుకున్నట్లే పాస్‌వర్డ్‌లను మార్చుకోవడం తప్పనిసరి అని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. డిజిటల్ మోసాలను అరికట్టే విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో సైబర్ నేరాల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఓటీపీలనే కాదు.. ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు. డిజిటల్ అరెస్టులు, ఆర్థిక మోసాల బారినపడి అనేకమంది తమ జీవితకాల సంపాదనను పోగొట్టుకుంటున్నారు. 'మీ ఖాతాదారును తెలుసుకో' (కేవైసీ) అనే నిబంధనను పూర్తి చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకు శాఖలకు వెళ్లి, లేదా బ్యాంకు యాప్‌లలో, ఇతరత్రా అధికారిక వేదికల ద్వారానే దీనిని పూర్తిచేయాలి. పింఛన్, రాయితీ, బీమా సొమ్ము, యూపీఐ.. అన్నీ బ్యాంకు ఖాతాతో అనుసంధానమై మిగతా .. 2లో..

## ఏపీ వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు..

**కేంద్రాల వద్ద సందడి**

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే చేరుకున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి.

### తిరుమల క్యూలైన్‌లో

## పాముకాటు ప్రచారం




**విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల క్యూలైన్‌లో ఓ భక్తురాలు పాముకాటుకు గురైనట్లు జరుగుతున్న ప్రచారాన్ని తితిదే ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు వాస్తవంగా అక్కడేం జరిగిందో వివరిస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సైతం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. "తిరుమల క్యూలైన్‌లో భక్తురాలు పాముకాటుకు గురైనట్లు కొందరు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. వాస్తవానికి జరిగింది ఏమిటంటే.. వరంగల్‌కు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం (ఫిబ్రవరి 22) రాత్రి స్వామి దర్శనం కోసం టాక్సీలో మిగతా .. 2లో..

### ఆక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ ఘటనపై

# రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

**మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా**

**ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాకు వచ్చిన ఆరోగ్య కమిషనర్ వీర పాండ్యన్**



**రాజమహేంద్రవం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాధితులకు పూర్తి వైద్య ఖర్చులు భారం ప్రభుత్వం భరిస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి, ధైర్యం కల్పించడం జరిగిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ జి.వీర పాండ్యన్ తెలిపారు. సోమవారం కిమ్స్, రెయిన్బో ఆసుపత్రులను ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్, ఎస్పీ డి.నరసింహ కిషోర్ తదితరులతో కలిసి కలెక్టర్ పర్యటించడం జరిగింది. రాజమహేంద్రవరంలో ఆక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందనీ ఆయన తెలిపారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు మిగతా .. 2లో..

# త్వరలో కుట్టు మిషన్ల పంపిణీ

**నూతన బడ్జెట్‌లో సింహభాగం బీసీలకే...**

**నేతన్న భరోసాకు రూ.250 కోట్లే కేటాయింపు**

**బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్‌పై చర్చలో మంత్రి సవిత**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, బడ్జెట్ లో సింహభాగం నిధులు వారికే కేటాయించారని తెలిపారు. 20 నెలల కూటమి ప్రభుత్వ పాలన బీసీల అభ్యున్నతికి ఇచ్చిన హామీలతో ఇవ్వని హామీలను సైతం అమలు చేశామన్నారు. నేతన్న భరోసా మిగతా .. 2లో..

### నా పేరుతో ఎలాంటి సంస్థల ఏర్పాటుకు

## అనుమతి లేదు : కేటీఆర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరిట కొందరు సంస్థలు ఏర్పాటు చేసి.. కార్యకలాపాలు నిర్వహించడంపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదన్నారు. ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్‌తో కలిసి పని చేయాలని అన్నారు. " నా పేరుతో ఎలాంటి సంస్థ ఏర్పాటుకు అనుమతి లేదు. ఇలాంటి సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదు. నా పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలు ఆపాలి. నాపై అభిమానం ఉన్నవారు బీఆర్ఎస్‌తో కలిసి పని చేయవచ్చు"అని కేటీఆర్ తెలిపారు.

### పోలీస్‌స్టేషన్‌లో

## ఏసీబీ అధికారుల సోదాలు

**అదుపులో సీఐ, ఎస్సై**




**సింహాద్రిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లా సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ ఎస్సై అనిల్ కుమార్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఓ కేసులో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో సోదాలు నిర్వహించిన అధికారులు రూరల్ సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం ఎస్సై అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

**అసలేం జరిగిందంటే...!**

కశ్మీర్‌లో చోరీకి గురైన ద్విచక్ర వాహనాలకు ఏపీలో నెంబర్ ప్లేట్లు మార్చి ఓ ముఠా విక్రయిస్తోంది. అందులో మిగతా .. 2లో..

### రాజమహేంద్రవరం అనూరియా కేసులపై

## మంత్రి కందుల దుర్గేష్ ఆరా

**బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశం**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో ప్రజలను కలవరపెడుతున్న అనూరియా (మూత్ర విసర్జన నిలిచిపోవడం) కేసుల పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. ఈ పరిస్థితిపై ఆయన సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఫోన్లో సమీక్ష నిర్వహించారు. బాధితులందరికీ తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, ప్రజలు ఎవరూ భయాందోళనలకు గురికావద్దని సూచించారు. ఇప్పటికే ప్రత్యేక వైద్య బృందాల ద్వారా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ద్వారా ఈ సమస్యకు గల మూల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని మిగతా .. 2లో..

## ఏమిటో మాకు ఇన్ని విజయాలు

**డ్రగ్ మాఫియా డాన్ హతంపై ట్రంప్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ నెమెసియో ఒసెగుయెరా అలియాస్ 'ఎల్ మెంచో'ను హతమార్చిన ఘనతను సొంతం చేసుకోవడం కోసం అమెరికా, మెక్సికో పోటీ పడుతున్నాయి. ఆదివారం జరిగిన ఆపరేషన్‌లో ఎల్ మెంచో మరణించిన విషయం తెలిసిందే. దీనిపై అమెరికా అధ్యక్షుడు స్పందిస్తూ.."అన్ని విషయాల్లోనూ మేమే గెలుస్తున్నాం. ఈ విధంగా అన్నింటిలో మిగతా .. 2లో..

## నదిలో పడిన బస్సు.. 18 మంది మృతి




**విశ్వం వాయిస్ న్యూస్ :** నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు లోయలో పడి 18 మంది మృతిచెందారు. మరో 28 మంది గాయపడ్డారు. పొఖారా నుంచి కాఠ్‌మాండూ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి త్రిశూలీ నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, మిగతా .. 2లో..

### ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి

## సీఎం చంద్రబాబు కృషి

**- కూటమి పాలనలో పేద విద్యార్థుల అభ్యున్నతికి పెద్ద మొత్తంలో నిధులు**

**- మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదరికం లేని సమాజమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, షెడ్యూల్ కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం 2026-27 బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం నాడు అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సంధర్భంగా మంత్రి డిఎస్ బీవీ స్వామి మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ప్రజల విద్యా, పురోగతి, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, వారి హక్కుల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.11,118 కోట్లు సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించాం. ఎస్సీసబ్ ప్లాన్ కింద రూ.20,643.57 కోట్లు మిగతా .. 2లో..

### భాజపా ఎంపీకి బెంగాల్ పురస్కారం..

## దీదీ ఎన్నికల ఎత్తుగడ?



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మరోసారి గెలిచేందుకు తృణమూల్ కాంగ్రెస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే ఇటీవల ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. భాజపా ఎంపీ నాగేన్ రాయ్ సహా పలువురికి టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ రాష్ట్ర పౌర పురస్కారం 'బంగ విభూషణ్' అందజేశారు. టీఎంసీ, భాజపాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్న వేళ ఈ అంశం రాజకీయంగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## సామాజిక సమానత్వం కోసమే అహర్నిశలూ కృషి

పెట్టాం. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాల వరకూ బలోపేతం చేశాం. రెసిడెన్షియల్ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యను అందిస్తున్నాం. పౌష్టికాహారంతో పాటు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రాన్ని పునర్నిర్మించి అభివృద్ధి చేసి ఆదాయం పెంచడంతో పాటు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు చెప్పాం. నాడు చెప్పినట్లు గానే నేడు ముందుకెళుతున్నాం. పీపీపీ ద్వారా గతంలో సంపద సృష్టికి ముందుకెళ్లాం. పీపీపీ విధానంలో రోడ్లు, విమానాశ్రయాల నిర్మాణం, మౌలిక వసతులు కల్పన జరిగింది. వీటితో సంపద పెరిగి, మెరుగైన వసతులు ఏర్పడినా అసమానతలు తగ్గలేదు. ఆర్థిక తారతమ్యాలు తగ్గించేందుకు పీ4 విధానాన్ని తీసుకొచ్చాం. 10 లక్షల బంగారు కుటుంబాలను 1 లక్ష మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఏ కార్యక్రమంలోనైనా ఫలితాలు వెంటనే రావు. అసమానతలు తగ్గించేందుకు పీ4 మించి కార్యక్రమం మరొకటి ఉండదు. కొందరికి ఉద్యోగాలు ఉండవు. ఇంకొన్ని వర్గాలు కూలీ పని చేస్తే తప్ప పూట గడవదు. అలాంటి వారిని ఆదుకుని పైకి తీసుకురావాల్సి ఉంది. 2047కు భారత్ అగ్ర దేశంగా తయారవుతుంది. వికసిత్ భారత్‌గా తయారయ్యేనాటికి అసమానతలు ఉండటం మంచిది కాదు. ఇది కేవలం పబ్లిక్ పాలసీల వల్లే సాధ్యం అవుతుంది. చట్టసభల్లో ఉన్న మనమందరం కృత నిశ్చయంతో పని చేస్తే ఇది కష్టం కాదు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### స్థానిక సంస్థల కంటే ముందే బీసీలకు రిజర్వేషన్లు

శాసన సభలో ఉన్న మనపై ఎంతో నమ్మకం ఉంచి ప్రజలు ఓట్లు వేశారు. 94 శాతం స్ట్రైక్ రైట్‌తో ఎన్డీఏకు సీట్లు ఇచ్చారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గించింది. గత ప్రభుత్వం తగ్గించిన రిజర్వేషన్లు మళ్లీ 34కు పెంచేందుకు వన్ మెన్ కమిటీ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే రిజర్వేషన్లు పెంచి అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నం చేస్తోంది. బీసీ రక్షణ చట్టం ఏర్పాటుకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశాం. అదే విధంగా బీసీల్లో ఉన్న కొందరు ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నారు...వీటిపై ఇప్పటికే చేసిన బిల్లులను కేంద్రానికి కూడా పంపాం. వాటిని ఫాలోఅప్ చేస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు.

### జీఓ నంబర్3పై త్వరలోనే ఓ నిర్ణయానికి వస్తాం

నేను ముఖ్యమంత్రి అయ్యాక మొదటిసారి 1996-1997లో ఎస్సీ వర్గీకరణ చేశాం. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడ లేకపోయాయి. ఇప్పుడు మళ్లీ వర్గీకరణ చేసి ఎస్సీల్లో కూడా సామాజిక న్యాయం చేసిన ఘనత మాది. గిరిజనుల కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ని కూడా గత పాలకులు కాపాడలేకపోయారు. దీంతో ఆ జీఓ నంబర్ 3ను సుప్రీం కోర్టు కొట్టేసింది. ఆచరణతో పాటు అందరికీ ఆమోద యోగ్యంగా జీఓ నంబర్ 3 ఉండాలి. అందుకే సమావేశాలు ఏర్పాటు చేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటాం. మైనారిటీలకు రక్షణ కల్పించడంతో పాటు మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం అందిస్తున్నాం. ఆడబిడ్డలను అన్ని విధాలా ఆదుకుంటున్నాం. ఆస్తి హక్కు బాగా చదివించడం ఎన్టీఆర్‌తో మొదలయ్యాయి. మహిళలు సాధికారత సాధిస్తే కుటుంబమే కాకుండా సమాజం కూడా సాధికారత సాధిస్తుంది. అగ్రవర్ణాల్లో పుట్టడమే మేం చేసిన పాపమా అని ఆ వర్గంలోని పేదలు బాధపడుతున్నారు. వారిని కూడా ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. పేదలు ఎక్కడున్నా మా ప్రభుత్వం ఆదుకుంటుంది. త్వరలోనే కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తీసుకొస్తాం. సంజీవని ద్వారా పేదలకు ఆర్థిక వెసులుబాటు కలిగి ఇబ్బందులు తగ్గుతాయి. అన్ని శాఖలకు విజ్ఞప్తి చేస్తున్నా...మీ విభాగాల్లో మంచిగా పని చేసి బలహీనవర్గాలను బలోపేతం చేయాలి. ఇది బలహీన వర్గాల ప్రభుత్వం...బలహీన వర్గాలను ఆదుకుంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

## కల్తీ పాల బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

ర్యాపిడ్ టెస్ట్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని సీఎంకు అధికారులు వివరించారు. పాల నమూనాలపై ఫలితాల అనంతరం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లాలన్నారు.

## పాస్‌వర్డ్‌లు మార్చండి

ఉన్నాయి. అందుకే బ్యాంకులు తరచూ కేవైసీ, రీ-కేవైసీ కోసం అడుగుతుంటాయి. మోసగాళ్లు ఈ విషయంలోనూ తప్పుడు కాల్స్, ఎస్ఎంఎస్‌లు, మోసపూరిత లింకుల ద్వారా రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు" అని మోదీ వివరించారు.

### మన సాంకేతికత ఆశ్చర్యపరిచింది

ఏఐ శిఖరాగ్ర సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని, మన సాంకేతికత వాటిని ఆశ్చర్యపరిచిందని మోదీ చెప్పారు. ఏఐ వినియోగంలో ఇదొక కీలక మలుపు అవుతుందన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చిన తల్లిదండ్రులను ప్రశంసించారు. టి-20 ప్రపంచ కప్‌లో భారత మూలాలున్న క్రికెటర్లు ఇతర దేశాల తరఫున ఆడి రాణిస్తుండటం ప్రజలకెంతో ఆనందాన్నిస్తోందని చెప్పారు. రాష్ట్రపతిభవన్‌లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ లుట్యెన్స్ విగ్రహం స్థానంలో భారతదేశ తొలి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నామని చెప్పారు.

### పిల్లలు పరీక్షల యోధులు

పిల్లలంటే పరీక్షల యోధులని, మార్కుల పత్రమే వారి విలువకు ప్రామాణికం కాదని మోదీ చెప్పారు. 'చదివినవన్నీ గుర్తుంటాయా లేదా? జవాబులు రాయడానికి సమయం సరిపోతుందా? అనే సందేహాలు తలెత్తడం సహజం. మీరు మాత్రమే కాదు.. ప్రతి తరంలోని పిల్లలూ ఎదుర్కొనే పరిస్థితే ఇది. మీపై మీరు నమ్మకం ఉంచండి' అని చెప్పారు.

తిరుమల క్యూలైన్‌లో

## పాముకాటు ప్రచారం

ఎస్వీ మ్యూజియం వద్దకు వచ్చారు. ఆర్.బి.సెంటర్ పార్కింగ్ ఏరియా వద్దకు రాగానే తన కాలికి పసుపు రాసుకునే ఉద్దేశంతో మౌనిక కారు నుంచి కిందకు దిగారు. ఆ సమయంలో తన కాలికి ఏదో తాకడంతో ఆమె భయంతో గట్టిగా అరిచారు. వెంటనే ఆమె భర్త శరత్ బాబు వెతికి చూడగా అక్కడ ఒక పాము పిల్ల కనిపించింది. దీంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది మౌనికను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. భక్తురాలిని పరీక్షించిన వైద్యులు ఆమె పాముకాటుకు గురికాలేదని నిర్ధారించారు. అయినప్పటికీ ఆమె శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తగా తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్చారు. స్విమ్స్ వైద్యులు సైతం ఆమె పాము కాటుకు గురికాలేదని చెప్పారు. అలాగే, అక్కడ కనిపించిన పాము కూడా విషపూరితం కాదని తేలింది. ఈ ఘటన జరిగిన వెంటనే తితిదే సిబ్బంది స్పందించిన తీరుకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం ఆ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. జరిగింది ఇదీ. అందువల్ల కొందరు చేస్తున్న ఫేక్ ప్రచారాలను భక్తులు నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేసింది.

## ఏసీబీ అధికారుల సోదాలు

బ్రహ్మం కీలక సభ్యుడు. అతడి నుంచి నిందితుడు బైక్ కొనుగోలు చేసి.. చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఇలా రూ.15 లక్షలు చోరీ చేసినట్లు గుర్తించారు. పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు.. బ్రహ్మంను రూ.4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో శనివారం కదిరికి చెందిన బ్రహ్మం రూ.లక్ష అందజేశాడు. మిగతా డబ్బుల కోసం ఒత్తిడి తీసుకురావడంతో ఏసీబీని ఆశ్రయించాడు. పక్కా వ్యూహం ప్రకారం సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటున్న ఎస్సై అనిల్‌కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును సీజ్ చేశారు. డీఎస్పీ, రూరల్ సీఐ ఆదేశాలతోనే బాధితుడు బ్రహ్మంను డబ్బులు డిమాండ్ చేసినట్లు అనిల్‌కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

భాజపా ఎంపీకి బెంగాల్ పురస్కారం..

## దీదీ ఎన్నికల ఎత్తుగడ?

చర్చనీయాంశమైంది. నాగేన్ రాయ్ రాజ్‌భాంగ్షీ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ నేత. ఉత్తర, మధ్య బెంగాల్‌లో ఈ వర్గం ప్రజలు పెద్దసంఖ్యలో విస్తరించి ఉన్నారు.గత ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో టీఎంసీకి సవాళ్లు ఎదురయ్యాయి. భాజపా మాత్రం మంచి ఫలితాలు సాధించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన్ను తమవైపు ఆకర్షించేందుకు అధికార పార్టీ వ్యూహరచన చేసిందనే వార్తలు వెల్లువెత్తాయి. ఎన్నికల ముందు నాగేన్ పార్టీ మారవచ్చనే వాదనలూ వినిపించాయి. అయితే, ఆయన వీటిని ఖండించారు. నాగేన్ రాయ్ 2023లో భాజపా ద్వారా రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. రాజ్‌భాంగ్షీ వర్గం ప్రజలు ఆయన్ను 'అనంత్ మహారాజ్' అని పిలుచుకుంటారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. బెంగాల్‌లో ఈ వర్గం ప్రజల సంఖ్య సుమారు 33 లక్షలుగా ఉంది. ముర్షిదాబాద్, మాల్దా, దార్జిలింగ్, ఉత్తర్ దీనాజ్‌పుర్, జల్‌పాయ్‌గుడీ వంటి ప్రాంతాల్లో ఎన్నికల్లో గెలుపోటములను నిర్ధరించే వర్గంగా ఉండటం గమనార్హం. నాగేన్ ఒకప్పుడు టీఎంసీకి దగ్గరగా ఉండేవారనే విశ్లేషణలు ఉన్నాయి. అనంతరం భాజపాకు చేరువయ్యారు. 2024లో ఓసారి దీదీ ఆయన ఇంటిని సందర్శించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)పై నాగేన్ ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను అమలు చేస్తున్న తీరు తమ సామాజిక వర్గానికి ఇబ్బందిగా మారిందని ఆరోపించారు. ఈ పరిణామాల వేళ పురస్కారాన్ని ప్రదానం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మొదట్లో 'బంగ విభూషణ్' జాబితాలో ఆయన పేరు లేదని, అనంతరం చేర్చారన్న ఊహాగానాలు ఉన్నాయి. తనకు ఈ అవార్డు వస్తుందని కలలో కూడా ఊహించలేదంటూ నాగేన్ పేర్కొనడం గమనార్హం.

ఆక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ ఘటనపై

## రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను నియమించి, పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందన్నారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కారణాలపై సాంకేతిక నిపుణుల కమిటీ పరిశీలన కొనసాగుతోందన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా బాధితులకి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో ఆరోగ్య శాఖ కమిషనర్ జి. వీర పాండ్యన్, ఐజీ జివి అశోక్ కుమార్, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా రేయిన్బో మరియు కిమ్స్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పర్యవేక్షించి ధైర్యం చేకూరించారు. పలుసార్లు ఆసుపత్రులను సందర్శించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం పరిస్థితిని పూర్తిగా అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఏదైనా సహాయం కావాలన్న, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060ను సంప్రదించవచ్చు అని తెలియ చేశారు.

## త్వరలో కుట్టు మిషన్ల పంపిణీ

పథకం కింద రూ.250 కోట్లు వెచ్చించనున్నామన్నారు. 2026-27 బడ్జెట్ కు సంబంధించి అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్ పై చర్చ సందర్భంగా రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ బీసీలకు ప్రాధాన్యమిచ్చి...వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు...బీసీలకు రెండు కళ్లవంటి వారన్నారు. .3.32 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ లో వెనుబడిన తరగతులకు రూ.51,020.56 కేటాయించారని వెల్లడించారు. నూతన బడ్జెట్ లో సింహభాగం నిధులు బీసీలకే కేటాయించారన్నారు. 20 నెలల కూటమి ప్రభుత్వ పాలన బీసీల అభ్యున్నతికి ఇచ్చిన హామీలతో ఇవ్వని హామీలను సైతం అమలు చేశామన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేశామని, గీత కులాలకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని తెలిపారు. నాయీబ్రాహ్మణ సెలూన్లకు ఉచిత విద్యుత్ సరఫరాను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచామన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు, దేవాలయ సేవల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచామని తెలిపారు.

### త్వరలో కుట్టు మిషన్లు

ప్రతి ఇంటి నుంచి ఒకరు వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు అందజేయనున్నామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 అమలు చేయనున్నామని, ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులకు

### బీసీల రక్షణ చట్టానికి తుది రూపు

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మగ్గం నేసే చేనేతలకు 200 యూనిట్ల వరకు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించామన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం రూపకల్పనకు తుది రూపు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల్లో కూడా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఇటీవలే రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ ను నియమించామన్నారు. ఈ కమిషన్ కు నివేదిక అందజేయడానికి 45 రోజుల గడువు విధించామని మంత్రి సవిత తెలిపారు.

### రూ.500 కోట్లతో ఎంజేపీ స్కూళ్ల నిర్మాణం

అన్ని గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల రక్షణ మరియు సౌకర్యార్థం సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లతో పాటు గురుకుల పాఠశాలల్లో కూడా పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించుట కొరకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. 6 ఎంజేపీ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. 20 ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణానికి సాస్కి పథకం కింద రూ.500 కోట్లు మంజూరు చేయనున్నామన్నారు. సింహాచలం మరియు టేకులోడు ఎంజేపీ స్కూల్ లో ××ు / చీజుజు ప్రత్యేక కోచింగ్ కేంద్రాల ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రూ.22 కోట్లు వెచ్చించి గురుకులాలకు, వసతి గృహాలకు అవసరమైన వంట పాత్రలు సరఫరా చేశామన్నారు. అన్ని వసతి గృహాల్లోనూ యూపీఎస్ లు, అన్ని వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాలికల వసతి గృహాల్లో రక్షణ కొరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం మరియు సౌకర్యం కొరకు అన్ని వసతి గృహాల్లోనూ మస్కిటో ప్రూఫింగ్ ఏర్పాటు చేశామన్నారు.

### రూ.250 కోట్లతో 'నేతన్న భరోసా' అమలు

నూతన బడ్జెట్ లో ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద 30 లక్షల మంది బీసీలకు రూ. 11,913.21 కోట్లు కేటాయించామని మంత్రి సవిత తెలిపారు. తల్లికి వందనం పథకం కింద తల్లి ఖాతాకు ఒక్కో పిల్లవానికి రూ. 15,000 చొప్పున అందించేందుకు రూ. 4,097.63 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దీపం-2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్లకు రూ. 1,383.62 కోట్లు కేటాయించామన్నారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్‌కు రూ.50 కోట్లు, నేతన్నలకు విద్యుత్ సబ్సిడీకి రూ. 150 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఆర్థిక సహాయానికి రూ. 250.42 కోట్లు, నేతన్నలకు ముడి సరకుల కొనుగోలు, మగ్గాల మరమ్మతుల సహాయానికి రూ. 226.11 కోట్లు, నేతన్న భరోసా పథకం కోసం రూ.250 కోట్లు కేటాయించామని మంత్రిసవిత తెలిపారు. ఈ పథకం కింద నేతన్నలకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేయనున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 10,699.33 కోట్లు కేటాయించామన్నారు.

### బీసీల ద్రోహి జగన్

జగన్ ప్రభుత్వంలో బీసీలతో పాటు అన్ని వర్గాల వారిని ఇబ్బందులు పాలయ్యారని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. ఆ అయిదేళ్లలో ప్రశ్నించిన బీసీ నాయకులపై కేసులు పెట్టారన్నారు. బీసీ బిడ్డల చదువులను నిర్లక్ష్యం చేస్తూ, సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు సరిపడా నిధులు ఇవ్వలేదన్నారు. బీసీల ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని మంత్రి సవిత మండిపడ్డారు.

### బీసీలకు చంద్రబాబుతోనే రాజకీయ ప్రాధాన్యం

బీసీలకు రాజకీయ ప్రాధన్యమిస్తున్న సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత కొనియాడారు. కేబినెట్ ఎనిమిది మంత్రులను, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును ఇలా అన్ని కీలక పదవుల్లోనూ బీసీలను సీఎం చంద్రబాబు నియమించారని మంత్రి సవిత తెలిపారు.

రాజమహేంద్రవరం అనూరియా కేసులపై

## మంత్రి కందుల దుర్గేష్ ఆరా

వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. కల్తీ పాల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

## ఏమిటో మాకు ఇన్ని విజయాలు

విజయం సాధించడం కూడా న్యాయం కాదు' అంటూ సోషల్ మీడియాలో సరదాగా పోస్ట్ చేశారు. అమెరికా నిఘా వర్గాల సమాచారంతోనే డ్రగ్ మాఫియా డాన్ 'ఎల్ మెంచో'ను మెక్సికో సైన్యం హతమార్చినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్న అనంతరం ట్రంప్ ఈ పోస్ట్ చేశారు. అమెరికాకు మాదకద్రవ్యాలను సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు అమలయ్యేలా ట్రంప్ యంత్రాంగం చర్యలు చేపట్టిందని కరోలిన్ లీవిట్ తెలిపారు. అందులో భాగంగానే మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషించిన ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో ప్రభుత్వానికి అమెరికా ఇంటెలిజెన్స్ సహకారం అందించిందన్నారు. అయితే అమెరికా నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ఆపరేషన్‌ను నిర్వహించినట్లు వస్తున్న వార్తలను వాషింగ్టన్‌లోని మెక్సికో రాయబార కార్యాలయం తోసిపుచ్చింది. డ్రగ్ మాఫియా డాన్‌ను బంధించడానికి చేపట్టిన ఆపరేషన్‌ను మెక్సికన్ ప్రత్యేక దళాలు ప్లాన్ చేసి నిర్వహించాయని తెలిపింది. ఈ విషయంలో అగ్రరాజ్యం కొంత సమాచారం (కాంప్లిమెంటరీ ఇంటెలిజెన్స్) మాత్రమే అందించిందని వెల్లడించింది.

## నదిలో పడిన బస్సు.. 18 మంది మృతి

రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, అతివేగం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి

## సీఎం చంద్రబాబు కృషి

కేటాయించడం జరిగింది. ఇది గతేడాది కంటే రూ. 362.65 కోట్లు ఎక్కువ. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వినియోగంపై రెగ్యులర్ గా నోడల్ ఏజెన్సీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. వసతి గృహాల నిర్మాణాలకు రూ.581 కోట్లు, ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కింద రూ. 389 కోట్లు, పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కింద 3,23 కోట్లు, ఉచిత విద్యుత్ కి రూ. 300 కోట్లు, ఆదర్శ గ్రామీణ యోజనకు రూ. 185 కోట్లు, అత్యాచార బాధితులకు ఆర్థిక సాయం కోసం రూ. 90 కోట్లు, హాస్టల్ భవన నిర్మాణాలకు రూ. 64 కోట్లు, కులాంతర వివాహ పథకానికి రూ.13.95 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. పేద పిల్లల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడాలి, వారు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలి అనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మెదట్లోనే రూ.143 కోట్లతో 783 హాస్టళ్లకు మరమ్మతులు చేయిటం జరిగింది. రూ. 55 కోట్లతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అదనపు టాయిలెట్లను ఏర్పాటు చేశాం. రూ. 60 కోట్లు సాస్కి నిధులతో ఆర్వో ప్లాంట్లు, మస్కిటో నెట్ లు ఏర్పాటు చేశాం. 2025-26 బడ్జెట్ లో సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు రూ. 365 కోట్లు ఖర్చు చేశాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ ఖర్చు పెట్టలేదు. విద్యార్దుల ఆరోగ్య పరిరక్షణకు ఉమ్మడి జిల్లాకొక వైద్యాకారిని నియమించాం.అనారోగ్యం పాలైన విద్యార్దులకు ప్రత్యేక చొరవతో కార్పోరేట్ వైద్యం అందిస్తున్నాం. తీవ్ర అనారోగ్యానికి గురైన పలువురు విద్యార్థులకు సీఎం చంద్రబాబు నాయుడు సీఎం.ఆర్.ఎఫ్ నిదులిచ్చి ప్రాణాలు కాపాడారు. 150 మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇస్తున్నాం, శిక్షణ అనంతరం వారికి జర్మనీలో ఉపాధి కల్పిస్తాం. 340 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్దులకు ఉచిత సివిల్స్ కోచింగ్ ఇస్తున్నాం. 140 మందికి ఎస్సెస్సీ, ఆర్.ఆర్.బీ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం. డీఎస్సీ ఉచిత కోచింగ్ వల్ల 300 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. అంబేద్కర్ గురుకులాల విద్యార్దులు గతేడాది ఐఐటీ నీట్ లో 57 మంది సీట్లు సాధించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10 కి పెంచాం, ఈ ఏడాది 161 విద్యార్దులు జేఈఈ మెయిన్స్ లో అర్హత సాధించారు. పీఎం అజయ్, డి.ఎమ్ ఎఫ్ నిధులు రూ.104 కోట్లతో 30 హాస్టళ్లు నిర్మిస్తున్నాం. వైసీసీ హయాంలో నిర్వీర్యమైన లిడ్ క్యాప్ ని పునరుద్ధరిస్తున్నాం. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం యడవల్లి, కృష్ణా జిల్లా జీ కొండూరులో రూ. 11.5 కోట్లతో పుట్ వేర్ మ్యానుఫ్యాక్షరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేశాం. డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తింపచేశాం, కొటక్ మహీంద్ర , తిరుపతి తలార్ యూనివర్సిటీ సహకారంతో అంబేద్కర్ గురుకులాల్లో వంట మనుషులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. అన్ని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమలు చేస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని గురుకులాల్లో పంక్షనరీ లిటరసీ అండ్ న్యూమరసీ గ్రేడింగ్ విధానం తీసుకొస్తాం. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో చనిపోయిన విద్యార్దుల కుటుంబాలకు సాంత్వన పథకంతో ఆర్దికంగా సాయం చేస్తున్నాం. ఎస్సి కాలనీల్లో స్మశాన వాటికల నిర్మాణానికి చర్యలు చేపడతాం. ఎస్సిల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## అమృతమా? కాలకూట విషమా?... తెల్లటి పాల వెనుక నల్లటి నిజాలు

గోదావరి తీరాన పవిత్రమైన పుణ్యక్షేత్రంగా పేరొందిన రాజమహేంద్రవరంలో ఇలాంటి 'తెల్లటి విషం' వ్యాపారం సాగడం అత్యంత ఆందోళన కలిగిస్తోంది. రాజమహేంద్రవరంలో వెలుగుచూసిన కల్తీ పాల ఉదంతం కలకలం రేపుతోంది. గోదావరి తీరాన పవిత్రమైన పుణ్యక్షేత్రంగా పేరొందిన రాజమహేంద్రవరంలో ఇలాంటి 'తెల్లటి విషం' వ్యాపారం సాగడం అత్యంత ఆందోళన కలిగిస్తోంది. కల్తీ పాలు తాగిన నలుగురు ఇప్పటికే మరణించగా, మరో 12 మంది మృత్యువుతో పోరాడుతున్నారు. అదేసమయంలో కల్తీ పాలు తాగిన బాధితులు వైద్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వైద్య శిబిరాల్లో బారులు తీరుతున్నారు. వైద్య పరీక్షల నివేదిక కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ప్రతి ఉదయం మన గుమ్మం ముందు వినిపించే పాలవాడి పిలుపు ఆరోగ్యానికి నాంది అనుకుంటాం. ఇంటిల్ల పాది మొత్తం పాలవాడు తెచ్చే పాలతోనే రోజును ఆరంభిస్తుంటారు. వృద్ధులు, పిల్లలు ఒకరేంటి ప్రతి ఇంటా పాలు లేనిదే రోజు గడవని పరిస్థితి. అంత ముఖ్యమైన పాలను విషంగా మార్చి విక్రయించడానికి మించిన నేరం లేదని అంటున్నారు. అమృతంలా భావించి మనం తాగే ఆ కప్పు టీ కాలకూట విషంగా మారి మన ప్రాణాలను కబళించే స్థితిలో ఉంటే.. ఆ భయాన్ని మాటల్లో వర్ణించగలమా? తెల్లటి పాల వెనుక దాగున్న నల్లటి నిజాలు షేక్ చేస్తున్నాయి. రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో పాలు కల్తీపై మరోసారి విస్తృత చర్చ జరుగుతోంది. వ్యాపారంలో లాభాల కోసం కొందరు చేస్తున్న పాపమే కల్తీ పాల వ్యాపారంగా చెప్పవచ్చు. పాలను చిక్కగా చేసేందుకు, ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు వాడే రసాయనాలు శరీరంలోని ముఖ్య అవయవాలను దెబ్బతీస్తున్నాయి. రాష్ట్రంలో డెయిరీలకు సరఫరా చేస్తున్న పాలలో సైతం ఇలాంటి కల్తీలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలను కల్తీ చేసేందుకు వ్యాపారులు వాడుతున్న సరుకులు భీతి గొలుపుతున్నాయి. గతంలో వెలుగు చూసిన కొన్ని ఉదంతాల్లో పాలను ఎలా కల్తీ చేస్తున్నారో గుర్తించారు. కల్తీ పాలలో ఎన్నో రకాలు పాలను నురగ వచ్చేలా చేసేందుకు యూరియా, డిటర్జెంట్స్ లిక్విడ్ సోపులను వాడుతున్నట్లు చెబుతున్నారు. ఇవి కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. దీర్ఘకాలంలో కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగిన వారు ముందుగా అస్వస్థతకు గురయ్యారు. గంటల వ్యవధిలోనే వారి కిడ్నీలు ఫెయిలై ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెబుతున్నారు. బాధితులకు మూత్రం నిలిచిపోవడం గమనిస్తే పాలలో ఖచ్చితంగా యూరియా కలిసి వుంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాలు విరిగిపోకుండా కొందరు ఫార్మాలిన్ కలుపుతుంటారని చెబుతున్నారు. నిజానికి ఇది శవాలను కుళ్లిపోకుండా ఉంచేందుకు వాడే రసాయనంగా చెబుతున్నారు. ఇది శరీరంలోకి వెళ్తే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో పాలు కల్తీ వల్ల 87 శాతం మంది క్యాన్సర్ ముప్పు ఎదుర్కొంటున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ 2018లోనే హెచ్చరించింది. ఇక కొందరు సింథటిక్ మిల్క్ తయారు చేస్తూ యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారని అంటున్నారు. యూరియా, కాస్టిక్ సోడా, శుద్ధి చేసిన నూనె కలిపి ఈ పాలు తయారు చేస్తుంటారని అంటున్నారు. ఇవి విషంతో సమానం. గుండె సంబంధిత వ్యాధులను కలిగించడమే కాకుండా అధిక రక్తపోటుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే పాల కల్తీని కొద్దిపాటి జాగ్రత్తలతో ఇంట్లోనే సులభంగా గుర్తించవచ్చని చెబుతున్నారు. కల్తీని గుర్తించడం ఎలా? పాలలో నీళ్లు కలిపారో లేదో తెలుసుకోవడానికి చిట్కాలు ఉన్నట్లే.. రసాయనాలతో తయారుచేసిన పాలను కూడా ఇంట్లోనే తేలిగ్గా గుర్తుపట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో గచ్చుపై ఒక చుక్క పాలను వేయడం ద్వారా పాలు స్వచ్ఛమైనవా కాదా అని తేలికగా తెలుసుకోవచ్చని అంటున్నారు. పాలు స్వచ్ఛమైనవి అయితే, అవి నెమ్మదిగా కదులుతూ వెనుక ఒక తెల్లటి గీతగా ఉంటుందని, అదే కల్తీ చేసిన పాలు అయితే, ఎటువంటి గీత లేకుండా వేగంగా కిందకు జారిపోతాయని అంటున్నారు. అదేవిధంగా పాలల్లో డిటర్జెంట్ లేదా సోప్ వాటర్ కలిపితే అవి విషపూరితంగా మారుతాయి. దీనిని గుర్తు పట్టడానికి ఒక గాజు గ్లాసులో కొద్దిగా పాలను తీసుకుని అంతే మోతాదులో నీరు కలిపి, వాటిని బాగా షేక్ చేయాలని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల దట్టమైన నురుగు వచ్చి, అది చాలా సేపటి వరకు తగ్గకపోతే అందులో డిటర్జెంట్ కలిపినట్లుగా అనుమానించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా యూరియా కలిపిన పాలు రుచిని మార్చవు కానీ ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అంటున్నారు. ఒక స్పూన్ పాలను తీసుకుని అందులో అర స్పూన్ సోయాబీన్ పొడి లేదా కందిపప్పు పొడి వేసి ఐదు నిమిషాల తర్వాత చూస్తే పాలలో యూరియా ఉందా? లేదా? అన్న విషయం తేలిపోతుందని చెబుతున్నారు. కందిపప్పు పొడి కలిపిన తర్వాత అందులో ఎర్రటి లిట్మస్ పేపర్ ఉంచాలని, ఆ పేపర్ నీలం రంగులోకి మారితే అందులో యూరియా ఉన్నట్లు అర్థం చేసుకోవాలని అంటున్నారు. అదేవిధంగా సింథటిక్ పాలును కూడా ఇంట్లోనే తేలిగ్గా గుర్తించవచ్చని అంటున్నారు.



సింథటిక్ పాలుగా అనుమానం వస్తే వెంటనే ఆ పాలను అరచేతిలో పోసుకుని బాగా రుద్దడం ద్వారా కల్తీని గుర్తించవచ్చని అంటున్నారు. పాలలో సోపు తగిలినట్లు జిగటగా అనిపిస్తే అవి సింథటిక్ పాలు అని గుర్తించాలని చెబుతున్నారు. అదేవిధంగా సింథటిక్ పాలు వేడి చేసిన తర్వాత పసుపు రంగులోకి మారిపోతాయని, ఇటువంటి పాలను అస్సలు సేవించకూడదని నిపుణులు చెబుతున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఎనిమిది మంది ఎల్ఈటీ ఉగ్రవాదుల అరెస్ట్

**వారిలో ఏడుగురు బంగ్లాదేశీయులు**

**తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ఢిల్లీ పోలీసుల దాడులు**

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్రవాద అణచివేత చర్యల్లో భాగంగా ఢిల్లీ పోలీసులు దేశంలోని మూడు రాష్ట్రాల్లో విస్తరించిన లష్కరే తయ్యిబా (ఎల్ఈటీ) మాడ్యుల్‌ను ఛేదించారు. ఏడుగురు బంగ్లాదేశీయులు సహా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరంతా భారత్‌లోకి ప్రవేశించి నకిలీ గుర్తింపు పత్రాలతో చలామణి అవుతున్నట్లు ఓ అధికారి చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్రవాది బుర్హాన్ వానీ చిత్రాలతో కూడిన.. పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థల అనుకూల నినాదాలున్న పోస్టర్లు వెలిసిన సంగతి తెలిసిందే. వీటి వెనుక తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో నక్కిన ఈ మాడ్యుల్ హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంటున్న జమ్మూ-కశ్మీర్‌కు చెందిన ఎల్ఈటీ ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ లోన్ అలియాస్ రజా అలియాస్ కశ్మీర్ ఈ మాడ్యుల్ నిర్వహిస్తున్నట్లు పోలీసు అదనపు కమిషనర్ (ప్రత్యేక విభాగం) ప్రమోద్‌సింగ్ ఆదివారం తెలిపారు. పోస్టర్ల విషయమై అందిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు ఈ నెల 15న పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన ఉమర్ ఫారుక్ (31), బంగ్లాదేశ్‌కు చెందిన రోబియుల్ ఇస్లాం (31)లను అరెస్టు చేశారు. శనివారం తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఏకకాలంలో దాడులు జరిపి, బంగ్లాదేశ్‌లోని బోగురా జిల్లాకు చెందిన మరో ఆరుగురిని అరెస్టు చేశారు. వీరిని మొహమ్మద్ మిజానూర్ రెహ్మాన్ (32), మొహమ్మద్ సెఫాయత్ హొస్సేన్ (34), మొహమ్మద్ జహీదుల్ ఇస్లాం (40), మొహమ్మద్ లిటన్ (40), మొహమ్మద్ ఉజ్జల్ (27), ఉమర్ (32)లుగా గుర్తించారు. బంగ్లాదేశ్‌కు చెందిన వీరు కార్మికుల ముసుగులో తిరుప్పూర్ వచ్చి బనియన్ కంపెనీల్లో చేరారని పోలీసులు తెలిపారు.

**పోస్టర్లు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం**

దాడుల సందర్భంగా, నిందితులు ఉంటున్న ఇళ్ల నుంచి పాకిస్థాన్ అనుకూల, ఉగ్రవాద అనుకూల పోస్టర్లు, అభియోగాలకు సంబంధించిన సమాచారం ఉన్న 10 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులు, 25 క్రెడిట్/ డెబిట్ కార్డులు, ఐదు పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాలు, బంగ్లాదేశ్ పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

## డబ్బులిస్తానని పిలిచి హత్య

**ఆపై కారును రిజర్వాయర్‌లోకి నెట్టి ప్రమాదంగా చిత్రించే యత్నం - వ్యాపార భాగస్వామే సూత్రధారి**

**యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసు ఛేదించిన పోలీసులు- నలుగురి అరెస్టు**




**ఏదులాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ గొల్ల శ్రీనివాసులు ఎలియాస్ బొగ్గుల శ్రీనివాస్(48) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయంలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో విగతజీవిగా కనిపించిన ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు.. అది ప్రమాదం కాదని హత్య అని.. శ్రీనివాస్ వ్యాపార భాగస్వామే ప్రధాన నిందితుడని తేల్చారు. ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీడియోలు చేస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేవారు. ఆయన, ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడుకు చెందిన మేకల వేణుమాధవ్‌రెడ్డి కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో కలిసి చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మళ్లీ కలుసుకుని పరిచయం పెంచుకున్నారు. శ్రీనివాస్‌కు 'బొగ్గుల బీబీక్యూ' పేరుతో జీఎస్టీ లైసెన్స్ ఉంది. వేణుమాధవ్‌రెడ్డి సొంతంగా 'మేకా ప్రాజెక్టు' అనే కంపెనీ పెట్టి సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. బొగ్గుల బీబీక్యూ పేరు మీద ఫేక్ ఇన్‌వాయిస్ ఫైల్ చేసి లాభాలు పొందవచ్చని వేణుమాధవ్‌రెడ్డి చెప్పడంతో శ్రీనివాస్ ఒప్పుకొన్నారు. తన జీఎస్టీ లైసెన్స్ ఉపయోగించుకున్నందుకు లాభాల్లో 50% వాటా ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా 2022-25 వరకు జీఎస్టీ ఫైలింగ్‌తో రూ.90 లక్షలు సంపాదించారు. శ్రీనివాస్‌కు లాభాల్లో రూ.45 లక్షలు రావాల్సి ఉండగా రూ.15 లక్షలు మాత్రమే చెల్లించాడు. ఇదే క్రమంలో జీఎస్టీ ఫైలింగ్‌లో అవకతవకలపై వేణుమాధవ్‌రెడ్డి, శ్రీనివాస్‌కు జీఎస్టీ విభాగం నోటీసులు జారీ చేసింది. బొగ్గుల బీబీక్యూ లైసెన్సును అధికారులు రద్దు చేశారు. లైసెన్సు పునరుద్ధరణ విషయంలో వారి మధ్య వివాదం మొదలైంది. అది ముదరడంతో శ్రీనివాస్‌ను అడ్డు తొలగించుకునేందుకు వేణుమాధవ్‌రెడ్డి పథకం రచించాడు. పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, ఎండీ హజ్మత్ అలీలతో కలిసి హత్యకు పథకం రూపొందించాడు. వారికి రూ.5 లక్షలు సుపారీ చెల్లించాడు. ఈ నెల 13న శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పెండింగ్ డబ్బులు చెల్లిస్తానని, విజయవాడకు వెళ్దామని చెప్పాడు. తన కారులో పోకల కోటేశ్వరరావుతో కలిసి శ్రీనివాస్‌ను ఎక్కించుకున్నాడు. వీరు మార్గంమధ్యలో మద్యం తాగారు. కొద్దిదూరం వెళ్లాక శ్రీనివాస్ నిద్రలోకి జారుకోగానే మధ్యలో హఫీజ్, హజ్మత్ అలీ వాహనంలోకి ఎక్కారు. ఈ నెల 14న తెల్లవారుజామున నకిరేకల్‌కు వచ్చాక కారును జనగామ వైపు వెళ్లే దారిలోకి మళ్లించారు. ఐరన్ రాడ్డుతో తలపై బలంగా మోది హత్య చేశారు. ప్రమాదంగా చిత్రీకరించేందుకు కారును పాలేరు రిజర్వాయర్‌లోకి నెట్టి పరారయ్యారు. ఒంటిపై గాయాలు ఉండటంతో మృతిపై శ్రీనివాస్ సోదరులు అనుమానాలు వ్యక్తం చేశారు. కూసుమంచి సీఐ ఆధ్వర్యంలో స్పెషల్ టీంతో దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక, ఇతర సాక్ష్యాల ఆధారంగా నలుగురిని అరెస్టు చేశారు.

**బంజారాహిల్స్‌లో బైక్‌ను**

## ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్..

**ఇద్దరి మృతి**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని బంజారా హిల్స్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను వాటర్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మృతులను హోంగార్డు సయ్యద్ హుస్సేన్, యువతి అక్షితగా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌లో సయ్యద్ హుస్సేన్ హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ తర్వాత పార్ట్‌టైమ్‌గా ర్యాపిడో బైక్ డ్రైవర్‌గానూ ఆయన పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం అక్షిత ర్యాపిడో ద్వారా రైడ్ బుక్ చేసుకుని సయ్యద్ హుస్సేన్ బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10 సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఆ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. అక్షితను విజయనగరం జిల్లాకు చెందిన యువతిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**చేతబడి చేయించాడనే అనుమానంతో కక్ష పెంచుకొని..**

## స్నేహితుడి హత్య

**తాండూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్‌కోటలో దారుణం చోటుచేసుకుంది. పట్టపగలే ఆటో డ్రైవర్ సాయిలు (45)ను ఆయన స్నేహితుడే నరికి చంపాడు. తాను ఆర్థికంగా నష్టపోవడానికి సాయిలు చేతబడి చేయించాడనే అను మానంతో నిందితుడు బాలప్ప కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే సాయిలును హత్య చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. బాలప్పను అదు పులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**దిగుబడి రాదనే ఆందోళనతో**

## మామిడి రైతు బలవన్మరణం



**చెన్నూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మామిడి చెట్ల పూత రాలిపోతుండటంతో ఆశించిన దిగుబడి రాదని ఆందోళన చెంది ఓ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొత్తగూడెంకు చెందిన ఎల్లబోయిన మల్లేశ్(47)కు చెన్నూరు మండలంలోని కన్నెపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో సుమారు ఐదెకరాల్లో మామిడి తోట ఉంది. దిగుబడి ఆశించిన స్థాయిలో రావాలని మందులు పిచికారీ చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టారు. అయితే వాతావరణ మార్పులతో కొద్దిరోజులకే పూత రాలిపోయింది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోనే పురుగు మందు తాగడంతో.. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు.

**మరికొన్ని గంటల్లో ఇద్దరి పెళ్లిళ్లు..**

## జోధ్‌పుర్‌లో అక్కాచెల్లెళ్ల మిస్టరీ మరణం

**విశ్వం వాయిస్ న్యూస్ :** రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ జిల్లా సూర్‌సాగర్ పోలీస్‌స్టేషన్ పరిధి మనై గ్రామంలో దీప్‌సింగ్ అనే వ్యక్తి తన ఇద్దరు కుమార్తెల వివాహాలు ఒకే ముహూర్తానికి ఖరారు చేయగా.. పెళ్లికి కొన్ని గంటల ముందు అక్కాచెల్లెళ్లు ఇద్దరూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శనివారం జరిగిన ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. నలుగురు కుమార్తెలున్న దీప్‌సింగ్ పెద్దమ్మాయికి ఇప్పటికే పెళ్లి చేశారు. బీఈడీ చదివి స్థానిక స్కూలులో పనిచేస్తున్న శోభ (25), విమల (23)ల వివాహాలు కూడా ఖరారు చేశారు. శుక్రవారం నుంచే పెళ్లి సంబరాలు మొదలయ్యాయి. అదేరోజు అర్ధరాత్రి అక్కాచెల్లెళ్లు ఇద్దరూ అస్వస్థతకు గురికాగా, ఆసుపత్రికి తరలించారు. దేహాలు నీలం రంగులోకి మారిన వారిద్దరూ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషం తాగి ఉండవచ్చని భావిస్తున్నారు. దీప్‌సింగ్ హడావుడిగా కుమార్తెల అంత్యక్రియలకు ఏర్పాట్లుచేయగా.. పోలీసులు అడ్డుకొని మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యాకే అప్పగించారు. నివేదికలు వచ్చిన తర్వాతే అసలు కారణాలు తెలుస్తాయని అదనపు డీసీపీ రోషన్ మీనా తెలిపారు. మేనకోడళ్లిద్దరూ ఒకేసారి చనిపోవడంపై శోభ, విమలల మేనమామ జస్వంత్‌సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. వారిద్దరికీ మొదట జరిగిన నిశ్చితార్థాలు రద్దు చేసి, తన బావ సోదరుల ఒత్తిడితో వేరే సంబంధాలు కుదిర్చారని చెప్పారు. ఈ పెళ్లిళ్లు అమ్మాయిలకు ఇష్టం లేదన్నారు.

## బంగారం ధరలు పరుగులు.. కారణం చెప్పేసిన నిర్మలా సీతారామన్..

దేశంలో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ డిమాండ్, అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితుల క్రమంలో పసిడి ధరలు అమాంతం పెరుగుతున్నాయి. మొన్నటివరకు ధరలు తగ్గగా.. ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో బంగారం ధరలు పెరగడంపై కేంద్రం ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు, ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లలో కోత విధించనుందనే వార్తల క్రమంలో పసిడి ధరలు మళ్లీ ఎగిసిపడ్డాయి. సోమవారం గోల్డ్, సిల్వర్ రేట్లు ఒక్కసారిగా పెరిగాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బంగారం రేట్లు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారు నిల్వలను పెంచుకుంటున్నాయి. ఇది కూడా పసిడి ధరల పెరుగుదలకు కారణమవుతోంది. ఈ క్రమంలో బంగారం ధరలపై పెరుగుదలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు.

**కారణం చెప్పిన నిర్మలమ్మ**

బంగారం ధరలు పెరగడానికి నిర్మలా సీతారామన్ కారణం చెప్పేశారు. కేంద్ర బ్యాంకులు గోల్డ్‌ను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండటమే ధరల పెరుగుదలకు కారణంగా తెలిపారు. ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంచుకునేందుకు కేంద్ర బ్యాంకులు బంగారాన్ని భారీగా కొనుగోలు చేస్తున్నాయి. దీని కారణంగానే పెరుగుతున్నట్లు ఆమె తెలిపారు. అలాగే పండుగ సమయాలు, పెళ్లిళ్ల సీజన్ వల్ల డిమాండ్ పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణమని తెలిపారు. అటు పసిడి ధరల పెరుగుదలను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని, ఆర్బీఐ కూడా పర్యవేక్షిస్తోందని తెలిపారు. బంగారం దిగుమతులు ఆందోళకర స్థాయిలో లేవని, ఆర్బీఐ నిరంతరం పరిశీలిస్తోందని అన్నారు. కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగ్గ స్థాయిలోనే ఉందని పేర్కొన్నారు. కొన్ని పరిమితుల్ని అధిగమించినట్లేనని పేర్కొన్నారు.

**రూ.2 వేలు పెరిగిన బంగారం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా పలు దేశాలపై 15 శాతం సుంకాలు విధించారు. దీని వల్ల బంగారం రేట్లపై ప్రభావితం చూపిస్తున్నాయి. అటు హైదరాబాద్‌లో సోమవారం 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,61,350 వద్ద కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే రూ.2 వేలు పెరిగింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,47,900 వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే రూ.1900 మేర పెరిగింది. అటు విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక చెన్నైలో రూ.1.62 లక్షల వద్ద బంగారం కొనసాగుతోంది. పెళ్లిళ్ల సీజన్ వేళ బంగారం ధరలు పెరగడం కొనుగోలుదారులకు పెద్ద భారంగా మారింది. పెళ్లిళ్ల సమయంలో బంగారానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. వధూవరులు కానుకగా ఇచ్చి పుచ్చుకోవడం జరుగుతుంది. అటు వెండి ధరలు ఒకేసారి రూ.10 వేలు పెరిగాయి. నిన్న రూ.2.90 లక్షలుగా ఉండగా.. ఇవాళ రూ.3 లక్షల మార్క్‌కు చేరుకున్నాయి.




**సామాన్యులకు గుడ్‌న్యూస్..**

## భారీగా తగ్గనున్న వంట నూనె ధరలు!



గృహాల్లో వంట నూనె వాడకం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు శుభవార్త అందించింది. పెరుగుతున్న ధరల మధ్య ఉపశమనం కలిగించే ప్రయత్నంలో భాగంగా ధరల నుంచి ఉపశమనం కలిగించనుంది. అయితే దీనిపై ఇప్పటికే అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం.. వంటనూనె.. ప్రతి ఇంట్లో ఇది ముఖ్యమైనదే. అయితే ప్రస్తుతం వంట నూనెల 150 రూపాయలకుపైనే ఉంది. సామాన్యులకు ఈ ధర కాస్త ఎక్కువ. గత కొన్ని రోజులుగా కాస్త అటు ఇటుగా ఇదే ధరతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సామాన్యులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు సమాచారం. నిత్యం పెరిగే ధరలతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు ఊరటనిచ్చేలా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముడి వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధనలు మే 31వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను కేంద్రం ఇప్పటికే విడుదల చేసింది. ఈ నిర్ణయం వల్ల రాబోయే రోజుల్లో వంట నూనె రేట్లు భారీగా తగ్గే అవకాశం కనిపిస్తోంది.అయితే ఇప్పుడున్న నియమ నిబంధనల ప్రకారం.. ముడి పామాయిల్, ముడి సోయాబీన్ ఆయిల్ తో పాటు ముడి పొద్దుతిరుగుడు నూనెలపై 20 శాతం దిగుమతి పన్ను విధిస్తోంది. ఇప్పుడు ఈ పన్నును సగానికి కుదించి 10 శాతానికి పరిమితం చేశారు. భారతదేశం తన వంట నూనె అవసరాల కోసం 70 శాతం వరకు ఇతర దేశాల పైనే ఆధారపడుతోంది. మన దేశంలో నూనె గింజల ఉత్పత్తి తక్కువగా ఉండటమే దీనికి ప్రధాన కారణమనే చెప్పాలి. విదేశాల నుండి వచ్చే ముడి చమురుపై పన్ను తగ్గడం వల్ల స్థానిక మార్కెట్‌లో ధరలు దిగివస్తాయి.

**పామాయిల్ దిగుమతి:**

కాగా, ఇక పామాయిల్‌ను ఇండోనేషియా, థాయిలాండ్, మలేషియా వంటి దేశాల నుంచి మన దేశం దిగుమతి చేసుకుంటోంది. అలాగే సన్‌ఫ్లవర్ నూనె ఉక్రెయిన్, రష్యా, అర్జెంటీనా, బ్రెజిల్ వంటి దేశాల నుంచి వస్తోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గిస్తే ఈ నూనెలపై మొత్తం పన్ను భారం 27.5 శాతం నుండి 16.5 శాతానికి తగ్గుతుంది. దీంతో ధరలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి.




- కల్తీపాల మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం
- శాసనసభలో ప్రటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- నివేదిక రాగానే బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్న ముఖ్యమంత్రి
- ప్రజలు భయాందోళన చెందవద్దు : రాజమహేంద్రవరం కలెక్టర్ కీర్తి చేకూరి
- ప్రజలు సంయమనం పాటించాలి : ఎస్పీ డి.నరసింహ కిషోర్
- ఫిర్యాదులకై హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060ను సంప్రదించవచ్చు

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో కల్తీపాల వినియోగంతో మృత్యువాత పడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ ఘటనపై శాసన సభలో మాట్లాడిన సీఎం... బాధిత కుటుంబాలకు పరిహా రాన్ని ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**కల్తీపాల ఘటన చాలా బాధాకరం**

శాసన సభలో రాజమహేంద్రవరం ఘటనపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 'రాజమహేంద్రవరం ఘటనలోని బాధితులు వాంతులు, కడుపునొప్పి, డయాలసిస్ సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్లీనికల్ పరీక్షల్లో రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయి పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. కోరుకొండ మండలం, నరసాపురం గ్రామంలో వరలక్ష్మీ మిల్క్ డెయిరీ 106 కుటుంబాలకు రోజూ పాల సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ నుంచి వచ్చిన పాలను తాగి అనారోగ్యం పాలయ్యారని అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇద్దరు వెంటిలేటర్‌పై ఉన్నారు. మరో 8 మంది చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు 70 ఏళ్లకు పైబడిన వారు, ఒకరు 58 ఏళ్ల వయసు వారు ఉన్నారు. బాధితుల నుంచి నమూనాలను తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం ల్యాబ్స్‌కు పరీక్షల కోసం పంపించాం. డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాసులకు కక్కుర్తి పడి ఈ కల్తీ వ్యవహారానికి పాల్పడితే సీరియస్‌గా తీసుకుంటాం. విచారణ అనంతరం దోషులపై చర్యలు తీసకుంటాం. రాష్ట్రంలో ఎవరైనా కల్తీకి పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా ప్రభుత్వం ఉదాసీనంగా ఉండదు...అత్యంత కఠినంగా వ్యవహరిస్తాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

**అసెంబ్లీలోని ఛాంబర్‌లో సమీక్ష**

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో పాల వినియోగంతో స్థానికులు అస్వస్థతకు గురవడం, పలువురు మరణించారన్న ఘటన తెలియగానే ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమీక్షించి ఘటనకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యసాయంపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న వారికి అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75 మంది నుంచి శాంపిల్స్ సేకరించామని, మిగిలిన వారందరి నుంచి కూడా నమూనాలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై మరోసారి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, అధికారులతో మధ్యాహ్నం సీఎం చంద్రబాబు సమీక్షించారు.

## ప్రజలు భయాందోళన చెందవద్దు

### కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై ప్రజలు భయాందోళన చెందవద్దని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. వై-జంక్షన్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్ ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత కేసులు నమోదైన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని తెలిపారు. జిల్లా పరిపాలన, వైద్య ఆరోగ్య, ఆహార భద్రత, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్థక శాఖలు మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక ప్రతిస్పందన బృందాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. డయాలసిస్ అవసరమైన మూత్రపిండ సమస్యలతో ఇప్పటివరకు 12 మంది నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చేరగా, వీరందరికీ ఒకే పాలవ్యాపారి పాలు సరఫరా చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆ వ్యాపారి పాలు సరఫరా చేసిన 106 ఇళ్లలోని కుటుంబాలకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 73 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. వీరందరికీ నిరంతర పర్యవేక్షణతో తగిన వైద్యసేవలు అందిస్తామని స్పష్టం చేశారు. పశుసంవర్థక శాఖ ద్వారా 46 పశువులకు పరీక్షలు నిర్వహించి నమూనాలను వైజ్ఞానిక మరియు పశుసంవర్థక శాఖ ప్రయోగశాలలకు పంపినట్లు తెలిపారు. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు తదితర పాల ఉత్పత్తులను హైదరాబాద్ మరియు విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పంపినట్లు వెల్లడించారు. నివేదికలు అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా స్పందించి, ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై సమగ్ర నివేదికను కోరినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించడంతో పాటు, మూల కారణాలను త్వరితగతిన గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రజల్లో అపోహలు వ్యాపించకుండా సమగ్ర అవగాహన కల్పించాలని, అవసరమైన అన్ని వనరులు వినియోగించాలన్న దిశగా సూచనలు అందించినట్లు చెప్పారు. కాబట్టి ప్రజలు భయాందోళన చెందవద్దని, అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కేసులకు సంబంధించి హెల్త్ బుల్లెట్ ను అధికారికంగా విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ ఇప్పటివరకు నాలుగు మరణాలు సంభవించినట్లు వెల్లడించారు. మృతులు ఎన్. శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), తాడి కృష్ణవేణి (76), తాడి రమణి (58)గా తెలిపారు. ఈ మరణాలకు సంబంధించిన మృతదేహ పరీక్షా నివేదికలు రావాల్సి ఉన్నట్లు చెప్పారు. అనధికారికంగా నిర్వహిస్తున్న డెయిరీని సీజ్ చేసి పాలవ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కారణాలు స్పష్టమైన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు సేకరించిన రక్త నమూనాల ఆధారంగా చిన్నపిల్లలు, వృద్ధులే ఎక్కువగా ప్రభావితమైనట్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రజలు కొన్ని రోజులు బాగా మరిగించిన పాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ెంకటేశ్వరరావు మాట్లాడుతూ... అనారోగ్యానికి గురైన వారిలో వికారంతో కూడిన వాంతులు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపించినట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడిన వారేనని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం రాత్రి నుంచి రక్త నమూనాల సేకరణ కొనసాగుతోందన్నారు. సమీక్ష సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.వి. సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కల్తీ పాల ఘటన బాధితులను పరామర్శించిన జక్కంపూడి

### ఐదుగురి ఆరోగ్యం స్థిరం – ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరంలో నమోదైన అనూరియా కేసుల నేపథ్యంలో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ కూడా ఆమెతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు రోగుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి రోగికి అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందేలా చూడాలని, అవసరమైన మందులు, పరికరాలు, నిపుణుల సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. వైద్యుల వివరాల ప్రకారం చికిత్స పొందుతున్న ఏడుగురిలో ఐదుగురి ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉంది. మరో ఇద్దరికి వెంటిలేటర్‌పై ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో కూడా సమీక్ష కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం రోగుల బంధువులతో మాట్లాడిన కలెక్టర్ కీర్తి చేకూరి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, మెరుగైన చికిత్సకు ఎటువంటి లోటు ఉండదని భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా సమన్వయ కర్త పి.ప్రియాంకతో పాటు ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

**రాజమండ్రి లాలాచెరువు, చౌడేశ్వర్ నగర్ ఏరియాల్లో**

## తీవ్ర అస్వస్థత, మరణాలపై సమగ్ర విచారణ చేయాలి

### భాధిత కుటుంబాలను, చౌడేశ్వర్ నగర్ ప్రాంతాన్ని, వైద్య శిబిరాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

**రాజమహేంద్రవరం, నేటివార్త :** రాజమండ్రి లాలాచెరువు, చౌడేశ్వర్ నగర్ ప్రాంతాల్లో తీవ్ర అస్వస్థత, మరణాలపై సమగ్ర పరిశీలన, విచారణ నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక చౌడేశ్వర్ నగర్ ప్రాంతాన్ని, భాదితులను సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ తో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. పవన్, నాయకులు రాజా, రాంబాబు, నాగభూషణం తదితరులు పర్యటించారు. భాదితుల నుండి వివరాలు తెలుసుకున్నారు. నగర పాలక సంస్థ కమీషనర్‌తో మాట్లాడారు. ఈ సందర్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ రాజమండ్రి నగరంలో లాలాచెరువు, చౌడేశ్వరం ప్రాంతంలో గత నాలుగైదు రోజులుగా ఆ ప్రాంతం లో ప్రజలు తీవ్రమైన అస్వస్థతకు గురై కిడ్నీలు వైఫల్యం చెంది ఇప్పటికీ 4గురు చనిపోయారని జిల్లా కలెక్టర్ ధ్రువీకరించారని దాదాపు 12 మంది పై బడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు పేర్కొంటునాయని అరుణ్ అన్నారు.ఈరోజు ఆ ప్రాంతాన్ని సిపిఎం పార్టీ బృందం పరిశీలించిందని అరుణ్ తెలిపారు. బాధితులతో, వైద్య బృందాలతో, వైద్యాధికారితో, నగరపాలక సంస్థ కమిషనర్ కూడా మాట్లాడామని అరుణ్ తెలిపారు అక్కడికి వచ్చినటువంటి కేసులు, వస్తున్నటువంటి కేసులు పరిశీలనచేస్తే వైద్య ఆరోగ్యశాఖ,నగరపాలక సంస్థ, జిల్లా కలెక్టర్ పాలు కల్తీ జరిగిందని ప్రాథమిక నిర్ధారణ వచ్చి దాని చుట్టూ పరిశీలన దారి చుట్టు ఇతర వైద్య సలహాలు అందిస్తున్నారు,అయితే కేవలం పాలు కల్తీ అని ఆగిపోకుండా ఆ ప్రాంతానికి వచ్చే మంచినీరు సంబంధించి కూడా సమగ్రంగా పరిశీలన చేయాలని కోరారు.దానితో పాటు ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయేమో కూడా పరిశీలన చేయాల్సినటువంటి అవసరం కూడా ఉంది అని పేర్కొన్నారు. సోమవారం నుంచి రాజమండ్రి నగరంలో ప్రైవేటు ఆసుపత్రిలో కిడ్నీ ఫెయిల్యూర్ అయినటువంటి కేసులు, వెంటే లెటర్స్ మీద ఉన్నటువంటి కేసులు డయాలసిస్ నడుస్తున్నటువంటి కేసులు ఉన్నాయి. దాదాపు మూడు సంవత్సరాల బాలిక కూడా ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థకు గురై ఉంది,60 సంవత్సరాలు వృద్దుల కూడా ఆస్పత్రిలో చేరున్నారని ఈ వ్యాధితో బాధపడుతున్నటువంటి బాధితులందరికీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న భాదితులకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోందని అరుణ్ పేర్కొన్నారు. చనిపోయిన బాధితుల కుటుంబాలకు10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, తక్షణమే లాలాచెరువు, చౌడేశ్వరి నగర్, దాంతోపాటు సుబ్బా నగర్, నారాయణపురం ఆ ప్రాంతాల ఆనుకునేటువంటి డివిజన్ అన్ని డివిజన్ లోని మంచినీటి సరఫరా మీద ప్రభుత్వం నిఘా పెట్టాలి. ఆ ఏరియాల్లో ఇట్లాంటి లక్షణాలు ఏవైతే ఉన్నాయో వాటి మీద స్క్రీనింగ్ టెస్ట్ చేయాలి. ఎవరైతే చనిపోయారో అమృతదేహాలకు ప్రభుత్వం పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా కూడా మరింత లోతుగా పరిశీలన చేసి సమస్య కు మూల కారణాలు కనుక్కోవాలని కోరారు.బాధితులను ఆదుకోవాలని, సిపిఎం జిల్లా కమిటీ కోరింది.



బాధలో ఉన్నవారికి తోడుగా నిలవడం

# మనందరి బాధ్యత

### మానవత్వం చాటుకున్న కామన్ మ్యాన్ సేవాదళ్



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : క్యాన్సర్‌తో బాధపడుతున్న యువతికి 10 వేల రూపాయలు ఆర్థిక సాయం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిల్లకుర్రు గ్రామానికి చెందిన ఇళ్ల దేవి శ్రీ గత కొన్ని రోజులుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ వైజాగ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య చికిత్సకు భారీ ఖర్చులు అవసరమవుతుండటంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కామన్ మ్యాన్ సేవాదళ్ సభ్యులకు తెలియజేయగా స్పందించిన సంస్థ ప్రతినిధులు వెంటనే కుటుంబాన్ని పరామర్శించి పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు బొక్కా ప్రసాద్ మాట్లాడుతూ "బాధలో ఉన్నవారికి తోడుగా నిలవడం మనందరి బాధ్యత"అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బిల్లకుర్రు ఎంపీటీసీ సభ్యులు చిత్రపు ఆనందబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కముజు గంగాధర్,టీమ్ సభ్యులు ముషిని వెంకట రమణ, గుత్తుల ప్రకాష్, కముజు శ్రీనివాస్, దాకారపు నాగేంద్ర,బీర సతీష్,కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా

# 'జనతా వారధి' కార్యక్రమం

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భరతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా 'జనతా వారధి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలు సమస్యలపై వారు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాసర్లపూడి బ్రిడ్జి వద్ద, ఆదుర్రులో పర్యాటక అభివృద్ధి కోసం నిర్మించిన గెస్ట్ హౌస్‌లను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అలా చేస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్డీవో కొత్త మాధవికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ మాలే శ్రీనివాస్ నగేశ్, జిల్లా కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్, దాకే వెంకటరావు, కొండేటి జయలక్ష్మి, అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

# పునర్వికి పునర్జన్మనిద్దాం..

### మీ చిన్న సాయం ఆ చిన్నారి నూరేళ్ల జీవితం



పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కర్నూలుకి చెందిన చిన్నారి పునర్విక ఎస్ఎంఎ అనే అరుదైన వ్యాధితో పోరాడుతుంది ఆ చిన్నారికి వైద్య ఖర్చులు నిమిత్తం ఒక ఇండక్షన్ కి 16 కోట్లు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలియజేయడంతో పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు అంత ఖర్చు భరించలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దీనిపై స్పందించిన కొంతమంది యువకులు ఆ చిన్నారికి సాయం చేయాలని ఉద్దేశంతో ఇంటింటికి షాప్ షాప్ కి తిరుగుతూ డబ్బా పట్టుకుని ధన సాయం అడుగుతున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా వంతు సహాయంగా చిన్నారికి ఎంతో కొంత సాయం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టమని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో చిరా దుర్గారావు, పిచ్చెట్టి గణేష్, కొడవటి సాయి, విజ్జిన బాలరాజు, మేళం నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో మెరిసిన ఆణిముత్యాలు



కాట్రేనికోన, విశ్వంవాయిస్ న్యూస్ : పుట్టిన ఊరుకు మంచి పేరు తెచ్చేందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తామని, నిరుపేద రోగులకు వైద్య సేవలు అందిస్తామని డాక్టరు కె.సింధుజ, కె.సాత్వికులు అన్నారు. కాట్రేనికోన మండలంలో 20 శాతం మాత్రమే అక్షరాస్యత కలిగిన పల్లం గ్రామంనకు చెందిన అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గంనకు చెందిన కెజివివిఎస్ రాజు, వాణిశ్రీ దంపతులకు చెందిన ఇద్దరు కుమార్తెలు డా.కె సింధుజ, కె సాత్విక ఆణిముత్యాలు వైద్య విద్యను పూర్తి చేసారు. కెజివివిఎస్ రాజు, వాణిశ్రీ దంపతులు ఇద్దరు వృతి రీత్యా ఉపాధ్యాయులు కావడం, శివారు ప్రాంతాలకు వైద్యం అందని ద్రాక్షగా ఉండటం, అక్షరాస్యత లేక పోవడంతో గ్రామంలో జరుగుతున్న అనర్థాలను గుర్తించి ఇద్దరు అమ్మాయిలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు. అమ్మాయిలు ఇద్దరు మెరిట్ కోటాపై అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లును సాధించి వైద్య విద్యను పూర్తి చేసారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో డా. కె సింధుజ 2024లో ఎంబిబిఎస్ పూర్తి చేయగా, కె సాత్విక ఈఏడాది ఎంబిబిఎస్ పూర్తి చేయడంతో కిమ్స్ కళాశాల డీన్ డా. ఆనందాచారి, డా. వర్దన చేతులు మీదుగా చైర్మన్ వైద్య పట్టాను అందుకున్నారు. అగ్నికులక్షత్రియులలో అక్షరాస్య అంతంత మాత్రంగా ఉన్న పల్లం గ్రామంనకు చెందిన ఇద్దరు అమ్మాయిలు వైద్య విద్యను చేయడంతో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎంపీపీ కోలాటి సత్యం, జె డ్పీటీసీ నేల కిషోర్లతో పాటు పల్లం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అనారోగ్య బాధితునికి

# రూ.50 వేలు ఆర్థిక సహాయం చేసిన మంత్రి సుభాష్



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం నియోజవర్గం వేగాయమ్మ పేటకు చెందిన ఒక వ్యక్తికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం నియోజవర్గం వేగాయమ్మ పేటకు చెందిన చొల్లంగి సుబ్రహ్మణ్యం గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయమై విశాఖపట్నం కు చెందిన వ్యాపారవేత్త పోతంశెట్టి ఆంజనేయులు రెడ్డి చొల్లంగి సుబ్రహ్మణ్యంకు మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. మంత్రి సుభాష్ తాను వ్యక్తిగతంగాను , సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారానే కాకుండా తన మిత్రులు, అనుచరుల ద్వారా కూడా ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మీ జవాను కుటుంబాన్ని

# పరామర్శించిన ఎంపీ హరీష్ బాలయోగి

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన ఆర్మీ జవాను బడుగు నాగబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషాద సంఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. దేశ సేవలో భాగంగా పంజాబ్ రాష్ట్రంలో 27 ఏ.డి ఆర్మీ క్యాంపులో విధులు నిర్వహిస్తున్న సమయంలో అనారోగ్యానికి గురైన నాగబాబు చికిత్స పొందుతూ కన్నుమూశారు. దేశ రక్షణలో విధులు నిర్వహిస్తున్న ఓ యువ జవాను ఇలా అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి బోడసకుర్రు గ్రామానికి వెళ్లి నాగబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి దుఃఖంలో భాగస్వామ్యమయ్యారు. దేశ సేవలో ఉన్న జవాను మరణం చాలా బాధాకరమని, ఆయన త్యాగం వృథా కాదని పేర్కొన్నారు. నాగబాబు కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందాల్సిన అన్ని హక్కులు, ఆర్థిక సహాయాలు, పరిహారం తదితర ప్రయోజనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్మీ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, నాగబాబు కుటుంబానికి సంబంధించిన అన్ని అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కుటుంబానికి న్యాయం జరిగేలా తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించే సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీ అన్నారు. నాగబాబు కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# రూ.7 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వశీ పెద్ద పీట - కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం పట్టణం ఎనిమిదో వార్డ్ గంగుమళ్ల వారి వీధిలో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ డీఈ శ్రీకాంత్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణంలో ఇప్పటికే పలు వార్డుల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని వివరించారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చూస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం నియోజవర్గంలో చేస్తున్న కృషి అభినందనీయమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, కూటమి పార్టీ నాయకులు, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా బ్యాగ్ లిఫ్టింగ్ దొంగ అరెస్ట్


విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి



డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు అమలాపురం పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి ఒక అంతర్‌జిల్లా మహిళా దొంగను అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి సుమారు రూ. 20.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెల 24-01-2026న తాటికొండ సత్యదేవి అనే మహిళ అమలాపురం హైస్కూల్ సెంటర్ నుంచి గోకలే సెంటర్ వరకు ఆటోలో ప్రయాణిస్తుండగా, ఆమె హ్యాండ్‌బ్యాగ్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు నగలను దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అమలాపురం పట్టణ పోలీసులు, క్రైమ్ కంట్రోల్ సిస్టమ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి, పట్టణంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలిని గుర్తించారు. కేవలం 14 గంటల వ్యవధిలోనే నిందితురాలిని అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలి పేరు బండి శివ పార్వతి (33 సంవత్సరాలు). ఆమె నివాసం తెలగాపాముల, డ్రైవర్స్ కాలనీ, గోకవరం, తూర్పు గోదావరి జిల్లా. ఆటోలు లేదా బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల లగేజీ, హ్యాండ్‌బ్యాగ్‌ల నుంచి విలువైన వస్తువులను అత్యంత చాకచక్యంగా దొంగిలించడం ఈమె నేర శైలి. నిందితురాలిపై అమలాపురం టౌన్ పరిధిలో రెండు కేసులు, తాలూకా స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదయ్యాయి. అదనంగా గోపాలపురం, గోకవరం, కర్నూలు, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కూడా ఈమెపై కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం (23-02-2026) నిందితురాలిని అరెస్ట్ చేసి, ఆమె వద్ద నుంచి 141.350 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ. 20,49,500. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన డి.ఎస్.పి. టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, టౌన్ ఇన్స్పెక్టర్ పి. వీరబాబు, క్రైమ్ కంట్రోల్ సిస్టమ్ సి.ఐ. ఎం. గజేంద్ర కుమార్, ఎస్.ఐ. పరదేశి, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# సాగునీరు అందించండి సార్.. పంటలు ఎండిపోతున్నాయి...

### కలెక్టర్ కార్యాలయంలో అల్లవరం రైతుల ఆవేదన - వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అల్లవరం మండలం, కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆందోళనతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమ గ్రామానికి చెందిన నాలుగో నెంబర్ పంట కాల్వ (కాల్వల) ద్వారా సాగునీరు అందడం లేదని, దీంతో వందల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కడలి రామకృష్ణ నాయకత్వంలో పలువురు రైతులు కలిసి కలెక్టర్‌ను కలిసి తమ గోడును వివరించారు. కాల్వల్లో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో వరి, పప్పుధాన్యాలు, ఇతర సాగు పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కార్మిక ఖర్చులు పెట్టి సాగు చేసిన పంటలు నీరు లేక నాశనమవుతుండటంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. ప్రస్తుతం సాగు దశలో ఉన్న పంటలకు సమయానికి నీరు అందకపోతే పూర్తిగా పంట నష్టం సంభవించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య పునరావృతమవుతోందని, సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా శాశ్వత పరిష్కారం లభించలేదని వారు పేర్కొన్నారు. రైతుల సమస్యను ఓపికగా విన్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కొమరగిరిపట్నం నాలుగో నెంబర్ కాల్వకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి వెంటనే సాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. పంటలు కాపాడాలని, తమ కుటుంబాల జీవనాధారం అయిన వ్యవసాయాన్ని రక్షించాలని రైతులు కోరుతున్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతే రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, అందువల్ల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. పంటలు కాపాడితేనే రైతు బతుకుతాడు... రైతు బతికితేనే దేశం నిలుస్తుంది అంటూ రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నార్తులకు

# ఆత్మీయత పంచే అన్న క్యాంటీన్లు

### నిర్వహణలో లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ డీఎస్ఓ ఉదయ భాస్కర్ రూ.5 చెల్లించి క్యూ లైన్‌లో అల్పాహారం స్వీకరించిన అధికారి



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, సృష్టిలో ప్రతి ప్రాణికి ఆహారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో నిర్వహణ పరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. సోమవారం నిర్వహించిన పరిశీలనలో భాగంగా జిల్లా పౌరసరఫరాల అధికారి ముగ్గురు సభ్యుల కమిటీతో కలిసి ముమ్మిడివరం, రామచంద్రపురం ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లను, అలాగే ద్రాక్షారామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలు అవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ భాస్కర్ రూ.5 చెల్లించి క్యూ లైన్‌లో నిలబడి అల్పాహారం తీసుకుని, ప్రజలతో కలిసి భోజనం చేశారు. అల్పాహారం కోసం వచ్చిన వారితో మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యత, రుచి, శుచితపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, తాగునీటి సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంకల్పాన్ని దృష్టిలో ఉంచుకుని క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అపరిశుభ్రత మచ్చుకైనా కనిపించకూడదని స్పష్టం చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టడంలో ఉన్న ఆనందం మరెక్కడా లభించదని, ఇలాంటి సేవా కార్యక్రమంలో పనిచేయడం అదృష్టంగా భావించి నిబద్ధతతో సేవలందించాలని సూచించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో ప్రజాభిప్రాయం సేకరించేందుకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతంగా క్యాంటీన్లను నిర్వహించాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలు కూడా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ రామయ్య, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ రాజు, ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్ రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ తీరుపై

# గంధం పల్లంరాజు ధ్వజం

### కాపుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

కాపు ఉద్యమ నేతగా చెప్పుకునే ముద్రగడ పద్మనాభం తీరుపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ముద్రగడ రాసిన లేఖకు కౌంటర్ ఇస్తూ ఆయన వైఖరిని ఎండగట్టారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పేరు మార్చుకున్న రోజే ముద్రగడ కాపు జాతి గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోయారని పల్లంరాజు ఆరోపించారు. కులం పేరుతో రాజకీయాలు చేయడం మానుకుని సమాజ ప్రయోజనాల కోసం నిజాయితీగా పనిచేయాలని హితవు పలికారు. అంబటి అరెస్టు పూర్తిగా చట్టపరమైన ప్రక్రియలో భాగమని, దానికి కుల రంగు పూసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం దురుద్దేశపూరిత రాజకీయమని ఆయన విమర్శించారు. గతంలో అంబటి రాంబాబు కాపు నేతలను, కులాన్ని కించపరిచేలా సోమరులు, తాగుబోతులు అంటూ వ్యాఖ్యానించినప్పుడు ముద్రగడ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అప్పుడు స్పందించని వారు ఇప్పుడు అంబటి అరెస్టుపై పౌరుషం ప్రదర్శించడం వెనుక రాజకీయ లాభాలే ఉన్నాయని నిలదీశారు. 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్ నిధులను దారి మళ్లించి సంస్థను నిర్వీర్యం చేసినప్పుడు ముద్రగడ ఎందుకు స్పందించలేదని పల్లంరాజు ధ్వజమెత్తారు. కాపు జాతిని ఓటు బ్యాంకుగా వాడుకుంటూ ప్రతి వేదికపై వారిని అవమానిస్తున్న ముద్రగడ, వైసీపీ నేతలు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని గంధం పల్లంరాజు డిమాండ్ చేశారు.


నాణ్యత లేకుండా నిర్మించిన రహదారి, పాఠశాల భవనాలపై

# విజిలెన్స్ దర్యాప్తు జరపాలి

### గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు



దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ : ఇందుకూరు పంచాయతీ పరిధిలో వైసీపీ ప్రభుత్వంలో నాణ్యత లోపంతో పలు పనులు జరిపించడం జరిగింది అని రావిలంక గ్రామానికి చెందిన వంగూరి చక్రవర్తి సోమవారం రంపచోడవరం ఐటిడిఏలో నిర్వహించిన గ్రీవెన్స్లో పిర్యాదు చేశారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవీపట్నం మండలం ఇందుకూరు నుండి చిన్నబీంపల్లి వేసిన గ్రావెల్ రోడ్డు నాణ్యత లేకుండా నిర్మించడం తో గతంలో డిఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో నేరుగా గ్రీవెన్స్ లో పిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అంతే కాకుండా ఇందుకూరుపేట లో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం సైతం నాణ్యత లేకుండా నిర్మించారని ఆయన ఆరోపిస్తూ రోడ్డు నిర్మాణం అలాగే పాఠశాల భవనాలపై తక్షణమే విజిలెన్స్ దర్యాప్తు జరిపి బిల్లులు చెల్లించాలని గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు ఇచ్చినట్టు ఆయన తెలిపారు.



మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



### కరువు ప్రాంతంలో

# ఉపాధి హామీ పథకమే జీవనాధారం...!

**ఉపాధి హామీలో కొత్త కొత్త పథకాలను అన్వేషించాలి - సెల్ సిగ్నల్ లేనిచోట కూలీలకు ముఖ ఆధారిత హాజరు**
**ఈ ఏడాది నుంచి కూలీలకు 60 రోజుల సెలవులు - ఏటా 7,500 పని దినాలు లేకుంటే డీ గ్రేడ్ - కొత్త ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల్లేవ్**
**సామాజిక తనిఖీ అనంతరం సమీక్ష సమావేశంలో డ్వామా పథకం సంచాలకురాలు వెంకటలక్ష్మి వెల్లడి**




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలోని కరువు, మెట్ట ప్రాంత మండలాల ప్రజలకు ఉపాధి హామీ పథకమే జీవనాధారమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకురాలు అడపా వెంకటలక్ష్మి పేర్కొన్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంత ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం మండలాలకు ఉపాధిహామీ పథకం అత్యంత అవసరం అన్నారు. ఈ నియోజకవర్గంలో వ్యవసాయ క్షేత్రాల సాగు నీటి వనరులు చాలా తక్కువని, అందువల్ల సాగు నీటి లభ్యత మొదటి పంట సాగు వరకే ఉపయోగపడుతుందని, ఈ నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు కూడా ఉన్నాయని, ఈ మెట్ట ప్రాంతాల్లో దాళ్వా పంటలు సాగు చేయడానికి వీలు కాదని అన్నారు. అందువల్ల జిల్లాలోని తీరప్రాంత మండలాలకన్న ఇటువంటి కరువు, మెట్ట ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పథకం చాలా ముఖ్యని, ఈ పథకం మాత్రమే ప్రధాన జీవనాధారంంగా ఉందని ఆమె వివరించారు. నియోజక వర్గంలోని మండల కేంద్ర శంఖవరంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ప్రాంగణంలో గురువారం 18 న శంఖవరం మండల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదికను గురువారం నిర్వహించారు. ప్రజా వేదిక మధ్యాహ్నం 12.55 గంటలకు సజావుగా విజయవంతంగా ముగిసాక అదే వేదికలో 2 గంటల వరకూ మండలంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయ, క్షేత్ర స్థాయి సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షిస్తూ రాబోయే కాలంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి పడాల వెంకటలక్ష్మి మార్గనిర్దేశం చేసారు. మెట్ట ప్రాంత ప్రజలకు జీవనాధారం కల్పించే విధంగా ఉపాధి హామీ పథకంలో కొత్త కొత్త పనులను మనం అన్వేషించాలని ఆమె సూచించారు. అందుకు గానూ బౌండరీ ట్రెంచెస్ (సరిహద్దు కేంద్రాలు) పనులు చేపట్టడం కొంచెం ఆపేసుకుని రింగ్ ట్రెంచెస్ (వలయ, వృత్తాకార, గుండ్రటి కందకాల) పనులు చేపట్టడానికి సిబ్బంది మారాలి అన్నారు. మెట్ట ప్రాంతాల్లో చాలా వరకూ అన్ ఈవెన్ ల్యాండ్స్ (అసమాన భూములు) ఉంటాయి. ఈ కొండలు, గుట్టలు, మెట్టల్లో వాటర్ ఫ్లోస్ (జలధారలు) ఉంటాయి. ఈ నీటి వాలు ప్రాంతాల్లో రింగ్ ట్రెంచెస్ ను తవ్వితే పైనుంచి పడిన నీటి ధారల వల్ల ఆ ట్రెంచెస్ భూమి లోపల కొంత కాలం పాటు నీటి తేమ నిల్వ ఉంటుందని, ఈ రింగ్ ట్రెంచెస్ లో కూడా మనం మొక్కలను పెంచొచ్చని ఆమె సూచించారు. ఈ జలధారల ప్రాంతాల్లో బోరు బావులను తవ్వుకోవడానికి, వేసవిలో కూడా పుష్కలంగా నీరు రావడానికి అవకాశం ఉంటుంది. ఈ బోరుబావుల నీటితో ఈల్డింగ్ (దిగుబడి) నిచ్చే పంటలను సాగుచేసు కోవచ్చని, బోరు బావుల దగ్గర కాపాలదారు ఖచ్చితంగా ఉండి భూమి లోపల నీటి పునురుద్దరణ స్థితి గమనించు కోవాలి. లేకపోతే నీటి వనరులు అడుగంటి పోతాయని, ఈ విధమైన కార్యాచరణను కూడా మనం చేపట్టాలని వెంకటలక్ష్మి మార్గనిర్దేశం చేసారు. వీటితోబాటు సామాజిక వనాలు పెంచడానికి మనం ప్రయత్నించాలి. గత ఏడాది అన్నవరం దేవస్థానం కొండలపై సామాజిక వనాలను పెంచడానికి మనం చాలా ప్రయత్నించాం. కానీ పెంచలేకపోయాం. అన్నవరం దేవస్థానానికి చాలా ఎక్కువ భూములు ఉన్నాయి. కాబట్టి అంతా ఒకేసారి కాకుండా ఐదేసి ఎకరాల చొప్పున దశలవారీగా సామాజిక వనాలను ఈ ఏడాది నుంచి తొలి ప్రాధాన్యతగా పెంచాలి. ఇవి దేవస్థానానికి, యాత్రీకులకు ఉపయోగపడతాయి. తద్వారా ఉపాధిహామీ కూలీలకు కూడా జీవన భృతిని కల్పించిన వారం అవుతాం. ఇలాంటి కొత్త కొత్త పథకాల అన్వేషణకు మనం కృషి చేయాలి. అక్కడక్కడా సెల్ టవర్స్, సిగ్నల్ లేనిచోట, గ్రామాల్లోనూ ఇకపై కూలీలకు ముఖ ఆధారిత హాజరును నమోదు చేస్తాం. ఈ విధానానికి కూడా ఇప్పటి నుంచే మన సిబ్బంది సంసిద్ధంగా ఉండాలి. ఈ ఏడాది నుంచి కొత్తగా ఉపాధి కూలీలకు ఏడాదిలో 60 రోజుల పాటు సెలవులను ప్రకటిస్తాం. వ్యవసాయ పనులు ఉన్న రోజుల్లో సెలవులు కావాలని కోరుతూ గ్రామ సభల్లో కూలీల ఇష్టం మేరకే తీర్మానాలు చేయిస్తాం. ఇవన్ని దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ కొత్త పథకం (బహుశా ఏప్రిల్-కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి) అమలుకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉండండని సంచాలకురాలు అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. ఈ ఫిబ్రవరిలో ఒక నెల, మార్చిలో నాలుగు నెలలు ఉన్నాం. ఈ ఐదు నెల్లల్లో వీలైనంత ఎక్కువ పని దినాలు పనిచేయించాలి. ఏడాదిలో 7,500 పని దినాల పాటు కూలి పనులను ఏ మేటైతే పని చేయించలేకపోతారో ఆ పంచాయతీ డీ గ్రేడ్ అయిపోయింది. అందువల్ల కూలీలకు అవగాహన కల్పించండి. వాళ్ళను డౌన్ గ్రేడ్ చేసే పరిస్థితికి తీసుకు రాకండి. ఈ ఏడాది మేట్లు ఎన్ని పని దినాలు పని చేయించ గలిగితే తర్వాత ఏడాది అన్ని పని దినాలనే ఆ పంచాయతీకి ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆమె వివరించారు. ఈ ఏడాది కొత్త ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు లేవు. వచ్చే ఏడాది ఉంటాయో ఉండవో తెలియదు. మండపం, వజ్రకూటం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. ఇక్కడి భాధ్యతలను పక్క గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగించాలి. ప్రతీ గ్రామాని ఓ ఫీల్డ్ అసిస్టెంటు నిధుడుంటే కూలీల హాజరు సక్రమంగా ఉంటుంది. కాస్త వెనుకబడ్డ పెదమల్లాపురం మహిళా మేట్ వంటి వారికి మరికొంత తర్ఫీదు ఇచ్చి ముందుకు నడిపిస్తూ ప్రోత్సాహించాలంటూ ఇంకా మరికొన్ని అంశాలపై గంట పాటు శంఖవరం మండలం ఉపాధి హామీ పథకం కార్యాలయం, క్షేత్ర స్థాయి సిబ్బందికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకురాలు అడపా వెంకటలక్ష్మి మార్గనిర్దేశం చేసారు.

# బడ్జెట్ సమావేశాల్లోనే అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ధర్నా

### మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి - సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారు. 2019 నుండి నిలకడగా ఉన్న అంగన్వాడీల వేతనాలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పెచలేదు. అంగన్వాడీలకు వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం చేయాలని 2023 డిశంబర్లో 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించాము. ఆ సమ్మె ముగింపు సందర్భంగా 2024 జూలైలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని ప్రభుత్వం మినిట్స్ కాపీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అంగన్వాడీల వేతనాలు పెంచాలని అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవించాం. అయినా నేటికీ వరకు అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదు. కనీసం ఈ ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల సందర్భంగానైనా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని కోరుతున్నాం... అని అంగన్వాడీలు గొంతెత్తి ధర్నా చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని శంఖవరం, రౌతులపూడి మండలాల ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శంఖవరం మండలం అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం రోంతా ధర్నా చేసారు. నేటి వారి విధులను అంగన్వాడీ కేంద్రాల సహాయకులకు అప్పగిం చారు. మంగళవారం సహాయకులు కూడా ధర్నా చేయనున్నారు. నేటి ఈ ధర్నా ఆందోళన కారులను ఉద్దేశించి అంగన్వాడీ సంఘం నాయకురాలు గెడ్డం బుల్లెమ్మ మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కొన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేసినందులకు కృతజ్ఞతలు. ఇంకా కొంతమంది అర్హత ఉన్న మినీ వర్కర్లు 10 వ తరగతి పాస్ అయిన మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయలేదు. మరో 1810 మినీ సెంటర్లలో క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా మార్చలేదు. వీరు మినీ వర్కర్లు. ఐనా వీరు వర్కర్ల పని, హెల్పర్ల పని చేస్తున్నారు. సెంటర్ నిర్వహణ కావాల్సిన అనుభవం ఉంది. కావున వారికి క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయాలి. 2024 మార్చిలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలుచేస్తామని జీఓ నెం.8 ఇచ్చారు. అయితే నేటికి గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయడానికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గైడ్లైన్స్ రూపొందించ లేదు. 2025 డిసెబర్ తరువాత కొంత మంది రిటైర్మెంట్ అయ్యారు. మరి కొంత మంది సర్వీసులో ఉండి చనిపోయారు. వారికి ఎటువంటి బెనిఫిట్ రాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం వలన అర్హులు తమ ప్రమోషన్లను కోల్పోతున్నారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం ఇస్తున్న స్నాక్స్ ఆపివేశారంటూ ప్రభుత్వ విధానాలను బుల్లెమ్మ తప్పు పట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26,000 లు ఇవ్వాలి. పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలి. గ్రాట్యూటి అమలుకు, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలి. పట్టణం, గ్రామీణం అనే తేడా లేకుండా అంగన్వాడీలకు సంక్షేమ పథకాలను అందరికీ అమలు చేయాలి. గైడ్లైన్స్ రూపొందించి అమలు చెయ్యాలి. పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి. మే నెల అంతా వేసవి సెలవుల జీఓను వెంటనే విడుదల చేయాలి. లబ్ధిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పుల పరిమాణం, మెనూ చార్జీలు పెంచాలి. ఉచితంగా గ్యాస్ సరఫరా చెయ్యాలి. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. 5 ఏళ్ళ లోపు పిల్లలు అందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని ఉత్తర్వులను ఇవ్వాలి. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలి అంటూ ధర్నా ఆందోళన కారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు అన్నింటినీ సకాలంలో పరిష్కరించాలని, లేకపోతే ఫిబ్రవరి 23 నుండి 27 వరకు రిలే నిరాహార దీక్షలు, ఆపై ప్రాజెక్టు, జిల్లా స్థాయిలో రిలే నిరాహార దీక్షలతో పాటు మార్చి 2 విజయవాడలో మహాధర్నా చేస్తామని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# నేటి ఎమ్మెల్యే - ఎంపిలు నిజమైన బానిసలు..

**మంత్రుల జీవితాలు విలాశాలకు మాత్రమే పరిమితం..- సొంత నిర్ణయాలు ప్రకటిస్తే నాటి నుండి శునక జీవితమే అనే హెచ్చరికలు..**
**జీతాలు తీసుకోండి.. ప్రతి నెలా ఇచ్చే అవినీతి సొమ్ములుతో దర్జాగా బ్రతకండి.. - రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపకులు మేడా శ్రీనివాస్ విమర్శ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రోజుకు 3 కోట్లు తీసుకుంటున్న ఆ మంత్రి ఎవరు ! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాల యంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్ర ఆరోపణ చేసారు. కార్పొరేట్ రాజకీయ పార్టీల నుండి ఎన్నికవుతున్న ఎమ్మెల్యే - ఎంపి ల బ్రతుకులు ప్రజలకు సేవచేయటానికి కాదు అమాత్య గురువులకు ఒంగి ఒంగి సలాములు చేస్తు బాంచన్ దొర అంటు వారి బానిసత్వాన్ని ఎప్పటికప్పుడు ఋజువు చేసుకోవటమే చట్ట సభలకు ఎన్నికయ్యే వారి విధులు అన్నారు. ఒక పంచాయితీ మెంబర్ కు ఉన్నటువంటి అర్హత నేటి ఎమ్మెల్యే - ఎంపి లకు లేకపోయింది. గత 20 ఏళ్ల నుండి ఇప్పటిదాకా ఎన్నికైన ఏ ఒక్క ప్రజా ప్రతినిధి అయినా తన సొంత నియోజకవర్గానికి సంబందించిన ఏ ఒక్క సమస్య పైన గాని, ఉద్యోగ ఉపాధి మార్గాల కోసం గాని స్వయం నిర్ణయాధికారంతో చట్ట సభలో ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాల నుండి ప్రతినిత్యం వహిస్తున్న వారు ప్రశ్నించిన దాఖలాలు ఉన్నాయా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చట్టం లేదు పాలన లేదు అవినీతి ఒక్కటే శాసనం. ప్రశ్నిస్తే తప్పవు వేధింపులు. అక్రమ కేసులు అన్నట్టు పాలన సాగుతుందన్నారు. పాలకులకు భయపడుతు బిడ్డలకు ఉగ్గుపాలు వలే భయాన్ని నూరిపోస్తున్న తల్లిదండ్రులు పెంపకంలో పిల్లల భవిష్యత్ ప్రేమతో గల భయం వారిని నిత్యం వెంటాడుతుంది. చట్టాలు అమలు కావు, న్యాయం ఖరీదైనదిగా మారింది, హక్కును అడుక్కోవాలి, న్యాయాన్ని కొనుక్కోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంత్రులు సేవ - పాలన అనకుండా కేవలం జీతాలు , అవినీతి ముడుపులు తీసుకుని జీవితాలను విలాసంగా గడపండి. అంతకు మించి ఆలోచిస్తే గడ్డు పరిస్థితులు తప్పవని సొంత నిఘా వర్గాల ద్వారా హెచ్చిరికలు ఎప్పటికప్పుడు వస్తుంటాయి. ఒక మంత్రి నిజంగా ప్రజలకు మంచి చెయాలనుకుంటే తనకు వున్న అధికారంతో ప్రజల హృదయాల్లో నిలిచిపోయేలా చరిత్ర కారులుగా నిలిచిపోవచ్చును. కాని నేటి మంత్రులు బానిసకు మించిన బానిస వలే వారి విశ్వాసాన్ని కార్పొరేట్ రాజకీయ పార్టిల అధినేతకు చూపిస్తున్నారు. ఆ గౌరవ స్థానం కల్పించిన ప్రజల పట్ల కనీసం విశ్వాసం చూపలేక పోతున్నారని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు. నేటి సమాజంలో కొన్ని మూగ జీవాలకు వున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రజాస్వా మ్యంలో మనుషులకు ఉండటం లేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపి, మంత్రి నని సొంత నిర్ణయాలు తీసుకున్నా ప్రకటించినా నాటి నుండి శునక జీవితాలకు పరిమితం కావటమే ననే భయం ప్రస్తుత ప్రజా ప్రతినిధులను వెంటడుతూనే వుంటున్నాయి. ప్రస్తుత కార్పొరేట్ రాజకీయ పార్టి ల నుండి చట్టసభలకు వెళ్తున్న వారు భయట మాత్రమే వారి ఫోజలు చాటుకుంటారు. లో లోన కుమిలి కుమిలి ఏడవటమే నన్నారు. ఒకప్పటి చట్ట సభల్లో సమస్యలు, అభివృద్ధి, భద్రత, సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, పర్యావరణ రక్షణ వంటి అంశాలపై చర్చలు సాగేవి. నేటి చట్ట సభల్లో చర్చలు లేకపోగా ఒక వర్గం బూతులను మరో వర్గం చప్పట్లు కొట్టటమే పనిగా ప్రజా ప్రతినిధులు బాధ్యతలను పొందిస్తున్నారు. పెద్ద మొత్తంలో జీతాలు తీసుకుంటున్నారు. నేడు చట్ట సభలకు వెళుతున్న వారి కన్నా ఇంటి ముందు విశ్వాసంగా వున్న శునకం చాలా మెరుగైన సేవలు అందిస్తుందని పలువురు గుసగుసలు వినిపిస్తున్నాయని ఆయన తెలిపారు. భయం, బలహీనతలే మానవ జీవితానికి ప్రాదిమిక హాక్కు, అదే జీవనాదారంగా సాగుతున్న పాలన సమాజానికి దురదృష్టం అన్నారు. బ్రతుక్కి అర్ధం లేదు. చావుకు కారణం లేదు. కన్న బిడ్డలను చంపుతున్నా, ఆడ బిడ్డలు వివస్త్రలు అవుతున్నా గొంతు మూగ బోవాల్సిందే ఇదే అత్యధిక శాతం బ్రతుకులుగా వుంటున్నాయి. బిడ్డను కాపాడుకోలేము. హక్కును పొందలేము. ఇంత హీనమైన జీవితం ఓటర్లుకు మాత్రమే సాధ్యం అన్నారు. రోజు రోజుకు మానవత్వం తరిగిపోతుంది. ఇలాంటి రాక్షస పాలనలోను, బక్షక సమాజం లోను అతి తక్కువ మానవ సమాజం మిగిలి ఉందంటే దేవుడు వున్నాడు అని చెప్పటానికి ఇంతకన్నా నిదర్శనం ఉంటుందా ! భయం బలహీనతలతో సామజిక ఉగ్రవాదాన్ని చూస్తు గడిపే వాడిని ఈ సమాజంలో భగవంతుడు మాత్రమే శిక్షిస్తునే వున్నాడు. ఈ కలుషిత పాలన నుండి ప్రజలకు విముక్తి కలిగించే రోజులు ఆ దైవ శక్తికి మాత్రమే వున్నాయి. ప్రస్తుత పాలకులకు జేజేలు కొట్టె వాడిని, జెండాలు కట్టే వాడిని ఆత్మ విమర్శ చేసుకోమనండి. ఎవరి పాడేకు వారే జెండా కట్టుకుంటున్నారనటంలో సందేహమే లేదు. ఎందుకు జేజేలు కొట్టు చున్నారు అనే నిజం తెలుసుకునే సమయానికి మొత్తం శున్యం అని అర్థం అవుతుందని ఆయన హితవు పలికారు. ప్రస్తుత కూటమి సర్కార్లో రోజుకు 3 కోట్లు అవినీతి సొమ్ము తీసుకుంటు పాలనను, తన శాఖను గాలికి వదిలేసిన ఆ మంత్రికి ఆంధ్ర రాష్ట్రంలో పరాభవం తప్పదన్నారు. ఆంధ్రులకు, ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్కు ద్రోహం చేస్తు తన వ్యక్తిగత సొంత రాజకీయ ప్రయోజనాలు పొందుతున్న ఆ అత్యున్నత మంత్రి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆర్పీసీ సెక్యులర్స్ డివి.రమణమూర్తి, సిమ్మా దుర్గారావు, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్ మేడిచర్ల శ్రీనివాసరావు, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, పసుపులేటి వీర్రాజు, బసా సోనియా, కాకర ప్రసాద్, చల్లా శివ దుర్గా ప్రసాద్, చల్లా అఖిల్, తదితరులు పాల్గొనియున్నారు.

# ధర్మవరంలో కోడిపందాల స్థావరంపై ఎస్సై దాడి



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ధర్మవరం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మికాంతం ఆదివారం దాడిచేసారు. ఆరుగురిని అరెస్టుచేసి, రెండు కోడి పుంజులను, రూ.2,550 నగదు స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె నిందితులను హెచ్చరించారు.

# హక్కుల సాధనలో సహకార పోరు

### డీసీసీబీ వద్ద ఉద్యోగుల నిరసన



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపుతో కాకినాడ రూరల్ మండలంలో 8వ రోజు సహకార ఉద్యోగులు సమరశంఖం పూరించారు. ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న తమ సమస్యలపై ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం నుంచి విధులను బహిష్కరించి ప్రత్యక్ష పోరాటానికి దిగారు. సర్పవరం, పెనుగుదురు, మరియు పండూరు వంటి కీలక ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యాలయాలకు తాళాలు వేసి తమ నిరసన గళాన్ని వినిపించారు. కార్యాలయాల మూసివేత అనంతరం ఉద్యోగులందరూ కాకినాడ దేవాలయం వీధిలోని డీసీసీబీ బ్రాంచ్ వద్దకు చేరుకుని భారీ ప్రదర్శన నిర్వహించారు. డిసిసిబి ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ జనరల్ సెక్రెటరీ ఎన్ వివి సత్యనారాయణ మద్దతుగా నిలిచారు, యూనియన్ తరపున ఎంప్లాయిస్ అందరికీ ఆయన సంఘీభావం తెలిపారు , ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సహకార రంగం కుదేలవుతోందని, రాత్రింబవళ్లు కష్టపడుతున్న ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకుని తమ డిమాండ్లు నెరవేరే వరకు కార్యాలయాల గడప తొక్కేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వంపై డిమాండ్ల వర్షం కురిపించారు. ముఖ్యంగా జీఓ నంబరు 36ను తక్షణమే అమలు చేయాలని వారు పట్టుబట్టారు. 2019 నుంచి ఊరిస్తున్న వేతన సవరణ ఊసే లేకపోవడంతో కనీసం మధ్యంతర భృతినైనా చెల్లించి ఆదుకోవాలని కోరారు. అలాగే పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ గ్రాట్యుటీపై ఉన్న రెండు లక్షల రూపాయల పరిమితిని పూర్తిగా తొలగించి చట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, 2019 తర్వాత విధుల్లో చేరిన వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని వారు స్పష్టం చేశారు. వ్యవస్థలో వస్తున్న మార్పుల వల్ల పీఏసీఎస్లు నామమాత్రంగా మారుతున్నాయని, రైతుల రుణాల పంపిణీ ప్రక్రియ నేరుగా కాకుండా సంఘాల ద్వారానే సాగాలని వారు కోరారు. సంస్థల ఆర్థిక పురోభివృద్ధి కోసం వాటా ధనంపై కనీసం ఆరు శాతం డివిడెండ్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు సమ్మె ఆగదని, పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# నెల్లిపూడి-శంఖవరం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి-శంఖవరం తారు రోడ్డు నిర్మాణ పనులకు కిర్లంపూడి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్ పర్సన్ బద్ది మణి సోమవారం శంకుస్థాపన చేసారు. నెల్లిపూడి శివారు శాంతి ఆశ్రమం ముఖద్వారం నుంచి వయా శంఖవరం జగ్గంపేట మీదుగా శంఖవరం వినాయకుడి గుడి వరకూ 5.830 కిలో మీటర్ల దూరం పొడవునా తారు రోడ్డు నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి సుమారు రూ. 4.07 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పనులకు జెసిబి వద్ద బద్ది మణి టెంకాయను కొట్టి, అరటి పళ్ళు పెట్టి తారు రోడ్డు నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఐతే ఈ అభివృద్ధి పనులను అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ధృవీకరణకు సర్పంచ్ వగైరా ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికార్లు, మండల ప్రజా పరిషత్తు అధికారులూ ఎవరూ లేరు. కేవలం తెలుగు పార్టీ నాయకులు, ఆ పార్టీ అనుబంధ సంస్థల ప్రతినిధులు మాత్రమే ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టి.ఎన్.టి.యు.సి. ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యుడు వెన్న శివ, రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్.ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్ది రామకృష్ణ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బద్ధి వెంకట రమణ, కనమ్మ చెరువు నీటి వినియోగదారుల సంఘం ధ్యక్షులు బద్ది లోవరాజు, మాజీ సర్పంచ్ చిట్టిమూరి విజయ్ కుమార్, నెల్లిపూడి తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పిర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాయుడు వారి పాలెంలో స్థలాల కబ్జా..

### పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి..





**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రామం రాయుడు వారి పాలెం టీచర్స్ కాలనీలో గల సి టి సి చర్చ్ పక్క సర్వేనెంబర్ 27/ 82 లో గల లేఔట్ లో రోడ్డుకి సంబంధించి 32 అడుగుల రోడ్డు కబ్జాకి గురైందని టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డీఎన్ మూర్తి, జాయింట్ సెక్రెటరీ అంబటి రామకృష్ణ లు ఆరోపించారు. టీచర్స్ కాలనీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో వారు మాట్లాడుతూ టీచర్స్ కాలనీకి సంబంధించి 211 ప్లాట్లు ఈ లేఔట్ లో ఉన్నాయని అయితే 212 ఫ్లాట్ గా దొంగ రిజిస్ట్రేషన్ చేయించి అక్కడ ఇల్లు నిర్మించే చర్యలు చేపట్టారని అన్నారు. అయితే మా అసోసియేషన్ తరపున పంచాయతీ కార్యదర్శి పాండురంగారావుకు ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని తిరిగి మాపై మాటల దాడి చేశారని కావాలంటే మీరు గ్రామసభ పెట్టుకోండి అను అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు అన్నారు. అయితే గ్రామసభ అధికారులు పెడతారే గాని కాలనీవాసులు కాదని ఒకవేళ అలా పెట్టాలంటే మీరు మాకు రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని అన్నమని తెలిపారు. గతంలో కూడా ఈ కార్యదర్శి పై ఆరోపణలో అతని పనిచేసిన పంచాయతీల్లో ఉన్నట్లు పేపర్లలో చదవమని మీడియాలో చూసామని అన్నారు. పంచాయతీ స్థలాలను కాపాడే అధికారే కబ్జా చేసే వారికి వత్తాసు పలికితే ఎలా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎమ్మెల్యే దృష్టిలో పెట్టుకుని ప్రజా శ్రేయస్సు కోసం ఇలాంటి వారిని వెంటనే పంపించే చర్యలు చేపట్టాలని వారు మీడియా ముందు తెలియజేశారు. గతంలో కూడా తనపై అనేక ఆరోపణలు ఉన్నాయని అయినా సరే రెండు గ్రామాలకు ఒకే పంచాయతీ కార్యదర్శిని వేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సోమవారం కలెక్టరేట్లో గల పిజిఆర్ఎస్లో ఫిర్యాదు చేయడం జరిగింది.

# మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్యకి ఘన నివాళులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్, ధవలేశ్వరం గ్రామం కుమ్మరి వీధిలో, కుమ్మర కార్పొరేషన్ డైరెక్టర్లు దాలిపర్తి వేమన, పండూరి అప్పారావు ఆధ్వర్యంలో "కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మరియు మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆకస్మిక మరణాన్ని" పురస్కరించుకుని ఆయన పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దాలిపర్తి వేమన మాట్లాడుతూ 97 సంవత్సరముల వయస్సు గల ఐలాపురం వెంకయ్య, వారి జీవితకాలంలో 60 సంవత్సరములు పైబడి కుమ్మర సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేశారని, నేడు "కుమ్మర శాలివాహన కార్పొరేషన్" రావడానికి ప్రధాన కారకులు ఐలాపురం వెంకయ్య గారు అని, వారికి ఘనంగా నివాళులు అర్పించడం మన బాధ్యత అని సమావేశంలో తెలియజేయడం జరిగింది, పండూరి అప్పారావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని కుమ్మర సామాజిక వర్గం యొక్క ఐకమత్యం కొరకు ఐలాపురం వెంకయ్య కృషి చేశారని, వారి అడుగుజాడలలో ప్రస్తుత యువత ముందుకు నడుస్తూ సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో విష్ణు, వెంకటేష్, కొత్తూరు దుర్గా రావు, మంతెన శ్రీనివాసరావు, వెంకటరమణ, కాజులూరి శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొని ఐలాపురం వెంకయ్య గారికి ఘన నివాళులు అర్పించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
మంగళవారం, 24 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com





# ప్రశ్నిస్తే కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేస్తారా..?

## బీజేపీ తీరుపై కొవ్వూరి శ్రీనివాస్ ఆగ్రహం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏఐ సమ్మిట్ సాక్షిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చైనా రోబోను ప్రదర్శిస్తే భారత దేశం పరువు తీసారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై బీజేపీ నాయకులు దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని పిసిసి అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్ ప్రశ్నించారు. స్థానిక టి-నగర్‌లో ఉన్న ఆయన కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో చైనా కుక్కబొమ్మతో (రోబో) మోదీ దేశం పరువు తీశారని మండి పడ్డారు. "సమ్మిట్‌లో శాంతియుత నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాధ్యతారా హిత్యం గురించి చంద్రబాబు, రాజకీయ ఐక్యత గురించి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది" అని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు, ఇడి, సిబిఐ కేసులకు భయపడి జగన్ బీజేపీలో అనైతిక కాపురం చేస్తూ రాజకీయాలను అపహాస్యం చేస్తున్నారని



ఆరోపించారు. అమెరికా ప్రయోజనం కోసం సున్నా సుంకాలకు ఒప్పుకున్నప్పుడే దేశ ప్రతిష్ట దిగజారిందని అన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు ఓర్వలేకే ఉగ్ర కోణం పేరుతో బిజెపి కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడి చేయడం దారుణం అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. బిజెపి వెంటనే జరిగిన ఘటనకు క్షమాపణ చెప్పి తన తప్పును ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టి కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ వారికి తొత్తుగా మారిన మోదీ, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌పై దాడులు చేయడం సరైన విధానం కాదన్నారు. మన దేశ ప్రతిభను తొక్కిపెట్టి విదేశాలను ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని, నాయకులను, కార్యకర్తలను బెదిరించాలని, భయపెట్టాలని చూస్తున్నారా అని నిలదీసారు. ఏడాదికి యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేసారు. ఇటువంటి బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరిపోదని, త్వరలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్నాల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చామర్తి లీలావతి, ఎనఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టి నవ తారకేష్, సీనియర్ నాయకులు యిజ్జరౌతు సత్యనారాయణ, కె.వరప్రసాద్, కాపు చిన వీరభద్రరావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కార్యాలయాలపై

# దాడులు చేయడం దారుణం..

**-పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆగ్రహం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏఐ సదస్సు వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశం పరువు తీసారని పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ విమర్శించారు. చైనా కుక్క బొమ్మ ప్రదర్శించడాన్ని నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేసిన కాంగ్రెస్ పార్టీపై, కార్యాలయాలపై దాడులను దిగడం సరైనది కాదని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మార్టిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. భాజపా అంటే బాబు, జగన్, పవన్ మారారని.. వీరు ప్రధాని మోదీ మౌత్ పీసుల్లా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో చైనా కుక్కబొమ్మతో (రోబో) మోదీ దేశం పరువు తీశారని మండి పడ్డారు. " సమ్మిట్ లో శాంతియుత నిరసన తెలిపిన కాంగ్రెస్ పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాధ్యతారా హిత్యం గురించి చంద్రబాబు, రాజకీయ ఐక్యత గురించి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించిన ట్టుంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా ప్రయోజనం కోసం సున్నా సుంకాలకు ఒప్పుకున్నప్పుడే దేశ ప్రతిష్ట దిగజారిందని అన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్కు పెరుగుతున్న మద్దతు ఓర్వలేకే ఉగ్ర కోణం పేరుతో బిజెపి కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడి చేయడం దారుణం అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. బిజెపి వెంటనే జరిగిన ఘటనకు క్షమాపణ చెప్పి తన తప్పును ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

### నరేంద్రపురం ఐశ్వర్య ఆగ్రో ఫుడ్స్ ఇండస్ట్రీస్‌లో

# జరిగిన ప్రమాదంపై ధర్నా

**బాధిత కార్మికుడు ఎస్.కే. కమల్ భాషాకు పూర్తి వైద్యం - రూ.15 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి**

**యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నరేంద్రపురం గ్రామ పరిధిలోని ఐశ్వర్య ఆగ్రో ఫుడ్స్ ఇండస్ట్రీస్‌లో ప్రమాదానికి గురైన రామచంద్రపురం పట్టణానికి చెందిన ఎస్.కే.కమల్ భాషాకు పూర్తి స్థాయి వైద్యం చేయించాలని, రూ.15 లక్షల నష్టపరిహారం యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ. ఎఫ్. టీ. యూ) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీ.ఆర్.ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా (ఐ. ఎఫ్.టీ.యూ)జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమా శంకరం మాట్లాడుతూ రాజానగరం మండలం, నరేంద్రపురం గ్రామంలోని ఐశ్వర్య ఆగ్రో ఫుడ్స్ ఇండస్ట్రీస్‌లో విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు ఎస్.కే. కమల్ భాషా (36) గత 09-10-2025 గురువారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో మిల్లులోని సార్టెక్స్ ఎలివేటర్ వద్ద వెల్డింగ్ పనులు చేస్తుండగా త్రీఫేస్ విద్యుత్ షాక్‌కు గురై సుమారు 40 అడుగుల ఎత్తు నుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి కాలు, భుజం, దవడ ఎముకలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం అయింది. చెవిలోని కర్ణభేరి నరం దెబ్బతిని తీవ్ర రక్తస్రావంతో కోమాలోకి వెళ్లాడు. ప్రస్తుతం శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. ఇంత తీవ్రమైన ప్రమాదం జరిగినప్పటికీ, విషయం బయటకు వస్తుందన్న భయంతో యాజమాన్యం పోలీస్ కేసు నమోదు కాకుండా అడ్డుకుని, ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకుండా రహస్యంగా వైద్యం చేయించింది. "అన్ని ఖర్చులు భరిస్తాం" అని చెప్పిన యాజమాన్యం. ఎస్. కె భాషా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించింది తప్ప అదనంగా ఎటువంటి ఖర్చు చేయలేదు. మందులు, తిండి కూడా సహాయం చేయకుండా బాధితుడిని వదిలేశారు. 12 సంవత్సరాలుగా అదే పరిశ్రమలో పనిచేస్తున్న కమల్ భాషా ఈ ప్రమాదంతో పూర్తిగా ఉపాధి కోల్పోయి కుటుంబాన్ని పోషించలేని స్థితిలో ఉన్నాడు. భార్య, చిన్నపిల్లలతో అప్పుల మీద జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. రెండు వారాల క్రితం జిల్లా కలెక్టర్‌కు పి.జి.ఆర్.ఎస్ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదు.

**ఐఫ్‌టియుఈ ఘటనను ఖండిస్తూ కింది డిమాండ్లు చేసింది:**

ఎస్.కే. కమల్ భాషాకు పూర్తి వైద్య ఖర్చులను యాజమాన్యమే భరించాలని, పరిశ్రమ ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రూ.15 లక్షల నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని, పూర్తిగా కోలుకునే వరకు నెలవారీ వైద్య భత్యం, జీవన భద్రత కల్పించాలని, ఐశ్వర్య ఆగ్రో ఫుడ్స్ ఇండస్ట్రీస్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కార్మిక చట్టాల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బాధితుడికి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్, పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు చింతా రాజా రెడ్డి, ఎం.ఆర్.పి.ఎస్ పి. వినయ్, బాధితుడు ఎస్.కే. భాషా కుటుంబ సభ్యులు ఎస్.కే. సుమయా, యూ.హరి, ఆర్.శివ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో కళ్ళజోళ్ళు పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సింహాచల నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వరహాలక్ష్మి నృసింహ స్వామి క్షేత్రంలో కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమం జరిగింది. శ్రీ మధుభయ వేదాంతచార్య పీఠం ట్రస్టు శ్రీరంగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. వారిలో కళ్ళజోళ్ళు అవసరమైన 270 మందికి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ట్రస్టు ఆలయ ధర్మకర్తలు కె.సింహాచలం, కె.నాగేశ్వరరావు చేతుల మీదుగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్లు సూర్య కుమారి, రాపర్తి శ్రీదేవి, శిఘాకొల్లి సీతారామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, మత్తు, మాదకద్రవ్యాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు..

**విద్యార్థులుకు గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి గాంధీనగరంలో గల డిఎన్‌టీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి నటువంటి సమస్త కార్యదర్శి తాతపూడి జయశ్రీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతూన్నారన్నారు. విద్యార్థులు, యువకులు డ్రగ్స్, గంజాయి మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అనరోగ్యపరమైన సమస్యలకు లోన్ అవుతారన్నారు యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆ మత్తులో అమ్మాయిలు, మహిళలు, విద్యార్థులు పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, దొంగతనాలు చేస్తున్నారన్నారు. మత్తు పదా ర్థాలను సరఫరాచేసేవారు కానీ, వాటికి అలవాటు పడిన వారు కానీ అసాంఘిక అలవాట్లను ప్రేరేపించే వారుగా, కారకులుగా శిక్షార్హులే అన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్,డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్జె న్సస్ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలవ్వకుండా మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని యువతకు, పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వసతి గృహం వార్డన్ నారాయణరావు మాట్లాడుతూ బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ సమాజంలో కళాశాలలో పాఠశాలల్లో విద్యార్థుల కొరకు యువతీ యువకుల కొరకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారిలో నైతిక విలువలు సత్ప్రవర్తన అలబడటానికి అవకాశం ఉంటుందని తెలిపారు ఈ సందర్భంగా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించడం జరిగింది ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కాళ్ళ శివ శంకర్ సమస్త ప్రతినిదులు సిహెచ్ ప్రదీప్ కుమార్ పి.వి.కిరణ్మయి, బి.బి.వి. ప్రసాద్ కె ఎస్ జ్యోతి కుమారి హాస్టల్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

**పాల కల్తీ ఘటనపై అధికారం యంత్రాంగం విచారణ జరుపుతోంది**

**చౌడేశ్వర్ నగర్‌లో పర్యటించిన గన్ని కృష్ణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చౌడేశ్వరి నగర్‌లో పాల కల్తీ వ్యవహారంలో అనారోగ్యం బారిన పడిన బాధితులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సోమవారం పరామర్శించారు. చౌడేశ్వరి నగర్ వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్,మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు మరుకుర్తి రవి యాదవ్ కలిసి బాధిత కుటుంబాలకు మాట్లాడి ధైర్యం చెప్పారు.కూటమి ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని, ఎవరు అధైర్య పడవద్దన్నారు. రక్త నమూనాల సేకరించిన ప్రభుత్వం విచారణ చేస్తుందన్నారు.ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ఇప్పటికే కూటమీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమై చర్యలు తీసుకుంటుందని, ఎవరు అధైర్య పడవద్దని కోరారు.

# ఘనంగా ఆలంబన స్వచ్ఛంద సేవా సంస్థ 18వ వార్షికోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలంబన స్వచ్ఛంద సేవా ఆధ్వర్యంలో విద్యా వారధి అనే కార్యక్రమం ద్వారా ఉచితంగా ట్యూషన్ చెప్పడం అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకులు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక ఏవి అప్పారావు రోడ్‌లో గల ఆలంబన విద్యా వారధి కేంద్రంలో జరిగిన 18 వ వార్షికోత్సవానికి రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకురాలు కే. భాగ్యలక్ష్మి వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అలాంటి లాభాపేక్ష లేకుండా మధ్యతరగతి దిగువ మధ్యతరగతి వారి పిల్లలను మొదటి తరం విద్యావంతులుగా తయారు చేసేందుకు ఆలంబన కృషి చేస్తుందన్నారు. భాగ్యలక్ష్మి తనకు వచ్చే పెన్షన్ తో పాటు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఆలంబనను 18 సంవత్సరాలుగా నడపడం ప్రశంసనీయమైన సేవ అన్నారు. 18 సంవత్సరాలుగా ఆలంబన వార్షికోత్సవ సమావేశంలో పాల్గొనడం ఆనందాన్ని ఇస్తుందన్నారు. మరో ముఖ్య అతిథి ఆరంభ ఆటిజం స్కూలు నిర్వాహకురాలు శారద మాట్లాడుతూ భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు చేస్తున్న సేవను కొనియాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి ముఖ్య అతిథి రాంబాబు చేతుల మీదుగా బహుమతులు అందించారు. నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటివరకూ సుమారు 50 మంది వివిధ ఉద్యోగాలలో కుదురుకున్నారని 20 మంది ఇంజనీరింగ్ ,డిగ్రీ తదితర కోర్సులు చదువుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, దివ్య, సత్యమూర్తి, గాంధీ విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అంగన్వాడీల న్యాయమైన కోరికలు నెరవేర్చాలి

**- మార్చి 2న చలో విజయవాడ**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన కోరికలను తక్షణమే నెరవేర్చాలని అంగన్వాడి యూనియన్ నాయకురాలు అన్నపూర్ణ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ కోరుకొండ తాసిల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ అంగన్ వాడిల కనీస వేతనాలు 26 వేలకు పెంచాలని, గ్రాడ్యుట్ తో పాటు వేతనం కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలన్నారు.164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మే మాసంలో వేతనంతో కూడిన సెలవలు మంజూరు చేస్తూ జీవో జారీ చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు సంబంధించిన నియమ నిబంధనలను విడుదల చేయాలన్నారు. అదేవిధంగా మార్చి 2న తలపెట్టిన "చలో విజయవాడ" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రగతిలో ఎర్రన్నాయుడు సేవలు చిరస్మరణీయం

**ఉత్తరాంధ్రలోనే కాక రాష్ట్ర ప్రజలలో గుండెల్లో ప్రత్యేక స్థానం పొందిన వ్యక్తి ఎర్రన్నాయుడు**

**రాయవరంలో ఘనంగా కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దివంగత నేత కింజారపు ఎర్రన్నాయుడు జయంతి ని పురస్కరించుకుని రాయవరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్ నినాదాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమనికి, ప్రజల సేవకు ఆయన జీవితాన్ని అర్పించి ఉత్తరాంధ్ర ప్రాంతానికే కాకుండా రాష్ట్ర ప్రజలు గుండెల్లో తనకంటూ ఒక స్థానాన్ని సాధించుకున్న వ్యక్తి ఎఱ్ఱన్నాయుడు అని కొనియాడారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా,నాలుగుసార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి గా, ఓటమెరుగని నాయకుడిలా తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమం లో రాయవరం టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కోటా రమణ, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వల్లూరి శ్రీను, జనసేన నాయకులు దేవిశెట్టి చిన్ని, సీనియర్ టిడిపి నాయకులు కొత్తల శీను, కొల్లి అప్పారావు, కుడిపూడి సూర్యనారాయణ, ఐటిడిపి నాయకులు దొంతంశెట్టి బాల కేదారేశ్వరుడు, కందుకూరి గంగరాజు, చంద్రమళ్ళ రాజు, అరుణ్ , వలి, మచ్చా సూర్యారావు, చల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### రాయవరంలో పటిష్ట బందోబస్తు మధ్య

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు.. మూతపడిన జిరాక్స్ సెంటర్లు**

**సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు: చీఫ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రెడ్డి**

**మొత్తం 248 మందికి గాను 233 మంది విద్యార్థుల హాజరు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండల పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావర ణంలో సోమవారం ప్రారంభ మయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేందుకు వీలుగా పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

**పోలీసుల పటిష్ట నిఘా..**

పోలీస్ స్టేషన్ లాకప్ భద్రతలో ఉన్న ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రానికి తరలించే వరకు పోలీసుల ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిమిత్తం సిబ్బందిని నియమించి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. కాపీయింగ్ తదితర మాల్ ప్రాక్టీస్‌లకు అవకాశం లేకుండా ముందస్తు చర్యగా స్థానికంగా ఉన్న జిరాక్స్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేయించారు.

**233 మంది విద్యార్థుల హాజరు..**

సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ సూర్యనారాయణ మాట్లాడుతూ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు అన్ని పరీక్షా గదులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 248 మంది విద్యార్థులకు గాను 233 మంది పరీక్షకు హాజరయ్యారని, 15 మంది గైర్హాజరయ్యారని వివరాలను వారు వెల్లడించారు.

# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు

**ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్**


**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ డి.కృష్ణ కిషోర్ తెలిపారు. సోమవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయన్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థిని విద్యార్థులు 474 మంది విద్యార్థులకు 451 మంది పరీక్షలకు హాజరు కాగా 23 మంది గైరాజరయ్యారన్నారు. ఒకేషనల్ 113 మందికి 105 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 8 మంది గైరాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

### విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేస్తున్న

# ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజక వర్గం, దేవీ పట్నం మండలం పరిధిలోని దేవారం మరియు పోతవరం గ్రామాలలో వీధి లైను విద్యుత్ స్తంభాలు మూడు నిన్న రాత్రి అకస్మాత్తుగా కురిసిన గాలివానకు విరిగి పడ్డాయి కానీ ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగలేదని ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవారం, శరభ వరం గ్రామ పంచాయతీలలో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు గాలివానకు విరిగినట్టు అయితే తక్షణమే నా దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,భారత్ ఆదివాసీ పార్టీ రంపచోడవరం డివిజన్ ప్రసార కార్యదర్శి చవలం విద్యాసాగర్, కారం ప్రకాష్ దొర,హరీష్,చిన్న,పంచాయతీ అడబాల పుల్లారావు,అడబాల హనుమంతు లైన్మెన్లు త్రిమూర్తులు, కృష్ణారెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు.



# హిట్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్న చిట్టి..

సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయం ఉన్నా అదృష్టం లేని ముద్దుగుమ్మలు చాలా మంది ఉన్నారు వారిలో ఫరియా అబ్దుల్లా ఒకరు. చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. కానీ ఆఫర్స్ మాత్రం అనుకున్నంతగా అందుకోలేకపోతుంది. సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయం ఉన్నా అదృష్టం లేని ముద్దుగుమ్మలు చాలా మంది ఉన్నారు వారిలో ఫరియా అబ్దుల్లా ఒకరు. చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. కానీ ఆఫర్స్ మాత్రం అనుకున్నంతగా అందుకోలేకపోతుంది. జాతిరత్నాలు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఫరియా అబ్దుల్లా. తొలి సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో అందం, అమాయకత్వంతో కట్టిపడేసింది. సినిమా తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది ఈ ముద్దుగుమ్మ. అవకాశాలు అయితే వచ్చాయి కానీ హిట్స్ మాత్రం పడలేదు. చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి. ఆ మధ్య శ్రీ సింహతో కలిసి నటించిన మత్తువదలరా 2 సినిమా ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. కానీ ఆతర్వాత అన్ని ఫ్లాప్ అయ్యాయి. హీరోయిన్ గానే కాదు స్పెషల్ సాంగ్ లోనూ మెప్పించింది ఈ అమ్మడు. బంగార్రాజు సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది ఫరియా. అలాగే అఖిల్ నటించిన మోస్ట్ ఎలిజిబిల్ బ్యాచిలర్, నవీన్ పోలిశెట్టి ఒకరాజు ఒక రాణి సినిమాలో గెస్ట్ రోల్స్ లనూ నటించింది చివరిగా గుర్రం పాపి రెడ్డి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఈ సినిమా కూడా నిరాశపరిచింది. ఇక సోషల్ మీడియాలో ఈ బ్యూటీ ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంది. హాట్ హాట్ ఫొటోలతో నెట్టింట రచ్చ చేస్తుంది. ఈ బ్యూటీ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

సినీ వాయిస్ CINEMA

రెండే రెండు సినిమాలతో

# మాయమైన మెరుపు తీగ మడోన్నా సెబాస్టియన్



టాలీవుడ్‌లో ఎంతో మంది మెరుపుతీగలు ఉన్నారు. అలా వచ్చి ఇలా మాయం అయినవారు. వారిలో మడోన్నా సెబాస్టియన్ ఒకరు. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ చిన్నది రెండు మూడు సినిమాలతోనే టాలీవుడ్ కు దూరం అయ్యింది. మలయాళంలో తెరకెక్కిన ప్రేమమ్ సినిమాతో పాపులర్ అయ్యింది. టాలీవుడ్‌లో ఎంతో మంది మెరుపుతీగలు ఉన్నారు. అలా వచ్చి ఇలా మాయం అయినవారు. వారిలో మడోన్నా సెబాస్టియన్ ఒకరు. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ చిన్నది రెండు మూడు సినిమాలతోనే టాలీవుడ్‌కు దూరం అయ్యింది. మలయాళంలో తెరకెక్కిన ప్రేమమ్ సినిమాతో పాపులర్ అయ్యింది మడోన్నా సెబాస్టియన్. అదే సినిమా తెలుగులో రీమేక్ కాగా ఆ సినిమాలో కూడా నటించింది. అదే ఈ అమ్మడి తొలి తెలుగు సినిమా. ఆతర్వాత చాలా గ్యాప్ తీసుకొని నాని సినిమాలో నటించింది. నాని శ్యామ్ సింగరాయ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది. శ్యామ్ సింగరాయ్ సినిమాలో లాయర్ గా కనిపించింది. ఆతర్వాత మరో తెలుగు సినిమాలో కనిపించలేదు. కేవలం మలయాళం, తమిళ్ సినిమాల పైనే ఎక్కువ ఫోకస్ పెడుతుంది ఈ చిన్నది. మొన్నటివరకు అక్కడ కూడా బిజీగా మారింది. కానీ ఈ మధ్య పెద్దగా సినిమాలు చేయడం లేదు. దాంతో ఇప్పుడు సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు యమా క్రేజ్ ఉంటుంది. రకరకాల ఫోటోలను పంచుకుంటుంది. మోడ్రన్ డ్రస్సుల్లో మెరిపిస్తూనే.. ట్రెడిషనల్ డ్రస్సులో అదరగొడుతుంది. ఒక్క బడా హీరో సినిమా పడితే ఈ చిన్నది తిరిగి ట్రాక్ లోకి వస్తుందని ఆమె అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ చిన్నదానికి ఆ ఛాన్స్ వస్తుందేమో చూడాలి.

క్రీడా వాయిస్

5 సిక్సులు, 5 ఫోర్లు.. 19 బంతుల్లో విధ్వంసం..

# వాంఖడేలో హిట్మేయర్ ఊచకత..



విండీస్ డేంజరస్ బ్యాటర్ హెట్‌మైయర్ 5 వరుస సిక్సర్లతోపాటు 5 ఫోర్లు బాదడంతో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో ఊచకోత మొదలుపెట్టాడు. దీంతో టాస్ ఓడి బౌలింగ్ ఎంచుకున్న జింబాబ్వే జట్టుకు భారీ షాక్ తగిలింది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 దశలో వెస్టిండీస్ ఐం జింబాబ్వే మధ్య జరుగుతున్న కీలక మ్యాచ్ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైయర్ కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ స్కోర్ బోర్డు వేగంగా దూసుకెళ్తోంది.టాస్ గెలిచిన జింబాబ్వే ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. పవర్‌ప్లేలో కొంత ఒత్తిడి ఎదురైనా, మిడిల్ ఓవర్లలో హెట్‌మైయర్ క్రీజ్‌లోకి దిగిన వెంటనే మ్యాచ్ సీన్ పూర్తిగా మారిపోయింది. స్పిన్నర్లపై దూకుడుగా, పేసర్లపై పవర్ ఫుల్ షాట్లతో అతడు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం ఈ వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తరఫున వేగవంతమైన అర్ధశతకాలలో ఒకటిగా నిలిచింది. హెట్‌మైయర్ 5 వరుస సిక్సర్లు, 5 ఫోర్లు బాదడంతో జింబాబ్వే బౌలర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. మరో వైపు బ్యాటింగ్ చేసిన సహచరులు కూడా స్థిరంగా నిలబడి భాగస్వామ్యాన్ని నిర్మించడంతో వెస్టిండీస్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లింది. డెత్ ఓవర్లలో మరింత దూకుడు చూపితే వెస్టిండీస్ 180ం స్కోర్ దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జింబాబ్వే బౌలర్లు పవర్‌ప్లేలో చూపిన క్రమశిక్షణను మిడిల్ ఓవర్లలో కొనసాగించలేకపోయారు. ముఖ్యంగా హెట్‌మైయర్ వేగంగా పరుగులు చేయడంతో మ్యాచ్‌పై వెస్టిండీస్ పట్టు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే బ్యాటింగ్ ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది.

# భారత్ ఓపెనింగ్ దరిద్రం..

## 20 జట్లలో టీమిండియాదే అత్యంత చెత్త రికార్డు





సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఎదురైన ఘోర పరాజయం టీమిండియా పరువును బజారున పడేసింది. ఈ ఓటమి తర్వాత సోషల్ మీడియాలో నెటిజన్లు భారత జట్టును ఒక ఆట ఆడుకుంటున్నారు. సెమీఫైనల్ వెళ్లడం ఇప్పుడు భారత్‌కు ఒక హిమాలయ పర్వతాన్ని ఎక్కినంత కష్టంగా మారింది. మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలవడంతో పాటు, పాతాళానికి పడిపోయిన రన్ రేట్‌ను కూడా సరిచేసుకోవాలి. అయితే ఈ దారుణ పరిస్థితులకు ప్రధాన కారణం మన ఓపెనర్లు అని గణాంకాలు చెబుతున్నాయి. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ జోడీ ఈ వరల్డ్ కప్‌లో భారత్‌కు అతిపెద్ద భారంగా మారింది. ఈ టీ20 వరల్డ్ కప్ 2026లో పాల్గొన్న మొత్తం 20 జట్లలో టీమిండియా ఓపెనింగ్ జోడీనే అత్యంత చెత్త ప్రదర్శన చేసింది. ఓపెనింగ్ భాగస్వామ్యంలో భారత్ సగటు కేవలం 6.8 పరుగులు మాత్రమే. మనకంటే చిన్న జట్టైన ఒమన్ (సగటు 10 పరుగులు), ఐర్లాండ్, యూఏఈ, అమెరికా జట్ల ఓపెనర్లు కూడా మనకంటే మెరుగ్గా రాణించడం సిగ్గుచేటు. ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు, అత్యుత్తమ బ్యాటర్లు ఉన్న జట్టుకు ఇలాంటి రికార్డు రావడం నిజంగానే అభిమానుల గుండెను రగిలిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ ఓపెనింగ్ జోడీ ఈ టోర్నీలో సూపర్ హిట్?గా నిలిచింది. వారి ఓపెనర్లు సగటున 84 పరుగులు జోడిస్తూ అగ్రస్థానంలో ఉన్నారు. చివరికి మన తర్వాతి ప్రత్యర్థి జింబాబ్వే ఓపెనర్లు కూడా సగటున 53.33 పరుగులు సాధించి భారత్‌కు హెచ్చరికలు పంపిస్తున్నారు. ఇషాన్ కిషన్ ఒక్క మ్యాచ్‌లో కూడా శుభారంభం ఇవ్వలేకపోగా, అభిషేక్ శర్మ ఫామ్ లేమితో కొట్టుమిట్టాడుతున్నాడు. బంతిని బాదడమే లక్ష్యంగా క్రీజులోకి వస్తున్న ఈ ఇద్దరు, కనీసం పవర్ ప్లే కూడా పూర్తి చేయకుండానే పెవిలియన్ చేరుతున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా ఓపెనింగ్ జోడీని మార్చాల్సిన సమయం ఆసన్నమైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫామ్ లేని అభిషేక్ శర్మను పక్కన పెట్టి, సంజూ శామ్సన్‌ను ఓపెనర్‌గా పంపాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. జట్టు అసిస్టెంట్ కోచ్ కూడా రాబోయే మ్యాచ్‌లకు ముందు సంజూ పేరును పరిశీలిస్తామని హింట్ ఇచ్చారు. మరి జింబాబ్వే, వెస్టిండీస్ వంటి కీలక మ్యాచ్‌లలోనైనా ఓపెనర్లు కళ్ళు తెరుస్తారా? లేక పాత పద్ధతిలోనే చేతులెత్తేస్తారా? అనేది తేలాల్సి ఉంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com